


సమాజ హితం – మా అభిమతం
www.arunaprabha.com
# అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 190 పేజీలు : 12, వెల రూ. 5/- మంగళవారం, 1 సెప్టెంబరు, 2026

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD
CHITTOR, VISHAKAPATANAM, SRIKAKULAM, ELLURU, ONGOL, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHM, GUNTUR, KURNOOL, KADAPA

# పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం: కేసీఆర్‌పై రేవంత్ ఫైర్

మూసారాంబాగ్ వద్ద కొత్త బ్రిడ్జిని ప్రారంభించిన ముఖ్యమంత్రి

పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేనిది రెండేళ్లలో చేసి చూపించామన్న సీఎం

కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని తీవ్ర ఆరోపణ

ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని వెల్లడి



హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట - మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై నూతనంగా నిర్మించిన వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల పాలనలో సాధ్యం కాని పనులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే పూర్తి చేసి చూపిందని పేర్కొన్నారు. వర్షం వస్తే మునిగిపోయే పాత వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలని పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు ఆలోచించలేదని

(మిగతా 2వ పేజీలో)



## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

సభలో బోరున విలపించిన కవిత

బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత

సభలో కన్నీటి పర్యంతమైన కవిత

"కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు

కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత

తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన

నిజామాబాద్: బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని

(మిగతా 2వ పేజీలో)



## ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం..

రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్

వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు

తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం

కిషన్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్

## వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు: చంద్రబాబు

3 దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం

నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు

గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ

2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ

నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: ముఖ్యమంత్రి



మార్కాపురం: ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకున్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు. ప్రాజెక్టు కోసం భూములు,

(మిగతా 2వ పేజీలో)



మజ్లిస్ నుంచి బహిష్కరణ..

## ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ మిస్సింగ్ కలకలం!

ఎంఐఎం నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ అదృశ్యం

మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలతో తీవ్ర వివాదంలో బేగ్

ఆరోపణలు అవాస్తవం, డీప్‌ఫేక్‌లతో కుట్ర చేస్తున్నారని ఆయన వెల్లడి

ఘటనపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ, బీఆర్ఎస్ డిమాండ్

హైదరాబాద్: ఎంఐఎం నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ అదృశ్యం కావడం హైదరాబాద్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఉమ్రా యాత్ర ముగించుకుని శనివారం నగరానికి చేరుకున్న ఆయన, అప్పటి నుంచి కనిపించకుండా పోయినట్లు సమాచారం. ఇప్పటికే పలు తీవ్రమైన ఆరోపణలతో వివాదాల్లో చిక్కుకున్న ఆయన అదృశ్యం కావడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. క్రమశిక్షణా చర్యల భాగంగా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి

(మిగతా 2వ పేజీలో)

## భాజపా-కాంగ్రెస్ కార్యాలయాల వద్ద పోటాపోటీ నిరసనలు

నాంపల్లిలో యువజన కాంగ్రెస్ ముట్టడి యత్నం

గేటుకు నల్లరంగు పూసి దిష్టిబొమ్మ దహనం

గాంధీభవన్ వైపు భాజపా యువ మోర్చా కార్యకర్తల దూకుడు

కాంగ్రెస్ జెండా దహనం చేసిన భాజపా శ్రేణులు

ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

దాడులు, విధ్వంస రాజకీయాలు సరికాదన్న భాజపా నేతలు



హైదరాబాద్: హైదరాబాద్‌లోని భాజపా, కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయాల వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరస్పరం నిరసనలకు దిగిన ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీగా ఆందోళనలు నిర్వహించడంతో నాంపల్లి, గన్‌ఫౌండ్రి, ఆబిడ్స్ ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భాజపా రాష్ట్ర కార్యాలయ ముట్టడికి ప్రయత్నించగా.. దీనికి ప్రతిగా భాజపా యువ మోర్చా కార్యకర్తలు గాంధీభవన్ ముట్టడికి యత్నించారు. దీంతో రెండు పార్టీల కార్యాలయాల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేపై భాజపా నేతలు అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, బిహార్‌లో విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించిన ఘటనను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం నాంపల్లిలోని

(మిగతా 2వ పేజీలో)



## యూపీలో విషాదం.. బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు, 11 మంది మృతి

యూపీలోని కౌశాంబిలో బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

11 మంది మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

మృతుల కుటుంబాలకు 2 లక్షలు, క్షతగాత్రులకు 50,000 ఎక్స్‌గ్రేషియా

ఘటనపై సీఎం యోగి దిగ్భ్రాంతి, బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం

## ఉత్తరాఖండ్‌కు కొత్త ముప్పు: 219 'వేలాడే' హిమానీనదాలు!

ఉత్తరాఖండ్‌లో 219 'వేలాడే' హిమానీనదాలను గుర్తించిన పరిశోధకులు

వీటిలో మూడో వంతు మంచు అస్థిరంగా ఉందని అధ్యయనంలో వెల్లడి

ఈ గ్లేసియర్లు కూలితే భారీ వరదలు, విపత్తులు సంభవించే ప్రమాదం

వాతావరణ మార్పుల వల్లే ఈ ముప్పు పెరుగుతోందని నిపుణుల ఆందోళన





## అమెరికాతో ఉద్రిక్తతలు భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు

ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రత్యేక భేటీ

ఉద్రిక్తతలు తగ్గించడానికి భారత్ తన పలుకుబడిని ఉపయోగించాలని విజ్ఞప్తి

శాంతి స్థాపనకు కృషిని ముమ్మరం చేయాలని నేతల నిర్ణయం

కష్టకాలంలో అండగా నిలిచినందుకు భారత్‌కు ఇరాన్ ధన్యవాదాలు

# వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు: చంద్రబాబు

ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు. సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన ఆనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.

### వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి

ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని ఆయన పునరుద్ఘాటించారు. ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళ్లు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.

### అది మోదీతోనే సాధ్యం

దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర



మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మార్కాపురాన్ని రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగం చేశామని, 2028 నాటికి వెలిగొండ రెండో దశను కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు.

# భాజపా-కాంగ్రెస్ కార్యాలయాల వద్ద పోటాపోటీ నిరసనలు

భాజపా కార్యాలయం వైపు తరలివచ్చారు. కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించిన కార్యకర్తలు గేటుకు నల్ల రంగు పూసి, దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. పరిస్థితి అదుపుతప్పకుండా పోలీసులు వారిని అడ్డుకుని పలు వురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని నగరం లోని వివిధ పోలీసుస్టేషన్లకు తరలించారు. యువజన కాం గ్రెస్ కార్యకర్తల ఆందోళన విషయం తెలుసుకున్న భాజపా యువ మోర్చా నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. గేటుకు పూసిన నల్లరంగును కార్యకర్తలు తొలగించారు. అనంతరం అక్కడి నుంచి గాంధీభవన్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కొందరు కార్యకర్తలు గుడ్లు, టమాటాలు విసిరి నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ కుండె, జి.హరీశ్వర్‌రెడ్డి తదితరులను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్లకు తరలించారు. మరోవైపు భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద ఆ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ జెండాను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు, యువ మోర్చా కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ఇరు కార్యాలయాల వద్ద బందోబస్తును పెంచారు. భాజపా రాష్ట్ర కార్యాలయంపై, నల్గొండ జిల్లా భాజపా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఖండించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, 22ఏ కుంభకోణంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భాజపా ప్రశ్నిస్తోందని, ఈ అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ నేతలు విధ్వంస రాజకీయాలకు తెరలేపుతున్నారని ఆయన ఆరోపించారు. భాజపా కార్యాలయాలు, కార్యకర్తల ఇళ్లపైకి వచ్చి దాడులకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. భాజపా కార్యాలయంపై యువజన కాంగ్రెస్ నేతలు ఆందోళన చేస్తున్న సమయంలో పోలీసులు ఎందుకు స్పందించలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంపై దాడిని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప కార్యాలయాలపై దాడులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. భాజపాకు ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేకే కాంగ్రెస్ నేతలు భౌతిక దాడులకు దిగుతున్నారని విమర్శించారు. తాజా పరిణామాలతో నగరంలో ఇరు పార్టీల మధ్య రాజకీయ వేడి మరింత పెరిగింది. పార్టీ కార్యాలయాల వద్ద జరిగిన ఆందోళనల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు.

# యూపీలో విషాదం.. బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు, 11 మంది మృతి

ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బాణాసంచా ఫ్యాక్టరీలో చెలరేగిన మంటలు వరుస పేలుళ్లకు దారితీయడంతో 11 మంది సజీవ దహనం అయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పిప్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మనోరి బజార్‌లో జరిగిన ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ శర్మ కథనం ప్రకారం, ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికార యంత్రాంగం, పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (చీణ=ఖీ), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ూణ=ఖీ) బృందాలను రంగంలోకి దించారు. ఇప్పటివరకు 11 మృతదేహాలను వెలికితీసినట్లు ఆయన ధ్రువీకరించారు. గాయపడిన ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూప్ రాణి నెహ్రూ (ూ=చీ) ఆసుపత్రికి తరలించారు. పేలుళ్ల తీవ్రతకు ఫ్యాక్టరీ భవనంతో పాటు సమీపంలోని కొన్ని నిర్మాణాలు కూడా కుప్పకూలాయి. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకొని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మేజిస్ట్రేట్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, వారి ఆస్తులను జప్తు చేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన పలువురు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని అన్నారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. ప్రమాద స్థలంలో బంధువులు తమ వారి కోసం శిథిలాల మధ్య వెతుకుతున్న దృశ్యాలు, ఆసుపత్రుల వద్ద ఆత్మీయుల సమాచారం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు అక్కడి పరిస్థితికి అద్దం పట్టాయి.

# ఉత్తరాఖండ్‌కు కొత్త ముప్పు 219 'వేలాడే' హిమానీనదాలు!

**ఉత్తరాఖండ్‌లో 219 'వేలాడే' హిమానీనదాలను గుర్తించిన పరిశోధకులు**

**వీటిలో మూడో వంతు మంచు అస్థిరంగా ఉందని అధ్యయనంలో వెల్లడి**

**ఈ గ్లేసియర్లు కూలితే భారీ వరదలు, విపత్తులు సంభవించే ప్రమాదం**

**వాతావరణ మార్పుల వల్లే ఈ ముప్పు పెరుగుతోందని నిపుణుల ఆందోళన**

హిమాలయ రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ప్రకృతి విపత్తులకు దారితీసే మరో పెనుముప్పు పొంచి ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. రాష్ట్రంలోని గర్వాల్ హిమాలయాల్లో ఏకంగా 219 'వేలాడే హిమానీనదాలు' (హ్యాంగింగ్ గ్లేసియర్స్) ఉన్నాయని, వాటిలో మూడో వంతు మంచు నిల్వలు అత్యంత అస్థిరంగా ఉన్నాయని ఈ పరిశోధన తేల్చింది. ఈ వివరాలు అంతర్జాతీయ సైన్స్ జర్నల్ 'నేచురల్ హజార్డ్స్'లో ప్రచురితమయ్యాయి. సాధారణంగా లోయల్లో ఉండే హిమానీనదాలతో పోలిస్తే, నిటారుగా ఉండే కొండ వాలులపై ఉండే ఈ 'వేలాడే హిమానీనదాలు' చాలా బలహీనంగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో హిమాలయ ప్రాంతం వేగంగా వేడెక్కుతుండటంతో, ఇవి ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ అధ్యయనం ప్రకారం, ఉత్తరాఖండ్‌లో గుర్తించిన 219 హిమానీనదాల మొత్తం 2.39 క్యూబిక్ కిలోమీటర్లు మంచు ఉండగా, అందులో 0.74 క్యూబిక్ కిలోమీటర్ల మేర మంచు అస్థిరంగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో 2013లో కేదార్‌నాథ్, 2021లో చమోలీ, 2023లో సిక్కింలో సంభవించిన పెను విపత్తులకు ఇలాంటి హిమానీనదాల విస్ఫోటనాలే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం ఫలితాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ సహకారంతో అత్యంత ప్రమాదకరమైన 13 హిమనద సరస్సులపై నిరంతర నిఘా ఉంచింది.

# ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

**రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్**

**వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు**

**తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ**

**రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం**

**కిషన్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్**

**కృష్ణా బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందని హరీశ్ ఆక్షేపణ**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం



నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

# 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు. కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

## పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం: కేసీఆర్‌పై రేవంత్ ఫైర్

రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సరైన ప్రభుత్వ కార్యాలయాలు లేవని, స్థానిక ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ప్రభుత్వ భవనాలను నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా, 10 ఎకరాల స్థలంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించారు. బతుకమ్మ కుంట కబ్జాకు పాల్పడుతున్న వారి వెనుక ఎవరి హస్తముందో ప్రజలు గమనించాలని ఆయన కోరారు. తాము బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, కనీసం ఏడో తేదీ వచ్చినా ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దయనీయ స్థితి నెలకొని ఉండేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలించిన 16 మంది ముఖ్యమంత్రులు కలిసి కేవలం రూ. 70 వేల కోట్లు అప్పు చేస్తే, కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. తమ ప్రభుత్వం చెరువులను కబ్జా చేసి విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించడం లేదని, కేవలం ఆక్రమణలను తొలగించి జలవనరులను కాపాడుతోందని స్పష్టం చేశారు. గతంలో తనను విమర్శించిన ఉద్యోగులే ఇప్పుడు తమ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకోవాలని ఆయన ఉద్యోగులను కోరారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

## మజ్లిస్ నుంచి బహిష్కరణ.. ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ మిస్సింగ్ కలకలం!

తక్షణమే బహిష్కరిస్తున్నట్లు ఇటీవల ఎంఐఎం ప్రకటించింది. అంతేకాకుండా, ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేయాలని పార్టీ అధిష్ఠానం ఆయనను ఆదేశించింది. అయితే, రాజీనామా చేసేందుకు నిరాకరించిన ఆయన, తాను ఎంఐఎం కార్యకర్తగానే కొనసాగుతానని అప్పట్లో స్పష్టం చేశారు. రహ్మత్ బేగ్ ఒక మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ సామాజిక మాధ్యమాల్లో తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే, ఈ ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తనను అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు కావాలనే మార్ఫింగ్, డీప్‌ఫేక్ వీడియోలు, ఫోటోలను సృష్టించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గుర్తుతెలియని వ్యక్తులు డబ్బుల కోసం తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, దీనిపై ఇప్పటికే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తనకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వివాదంపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు స్పందిస్తూ, ఆరోపణలపై పారదర్శకంగా, సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ అంశంపై నిష్పక్షపాత విచారణకు ఆదేశించి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ కోరారు. ఈ వరుస వివాదాల నేపథ్యంలో రహ్మత్ బేగ్ అదృశ్యం కావడం ఈ వ్యవహారాన్ని మరింత సంక్లిష్టంగా మార్చింది.

## అమెరికాతో ఉద్రిక్తతలు భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు

అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్న ఇరాన్–అమెరికా వివాదం పరిష్కారానికి భారత్ చొరవ చూపాలని ఇరాన్ నాయకత్వం అభ్యర్థించింది. కిర్గిజ్‌స్థాన్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ూజుూ) సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తనకున్న దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించాలని ఆయన మోదీని కోరారు. ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్నందుకు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా దౌత్య మార్గాన్ని విడనాడి యుద్ధ మార్గాన్ని ఎంచుకుందని, ఆ దేశంలోని కొన్ని శక్తులు ఈ వివాదం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చర్చలు, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఆయన, ఇతర దేశాలు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధానమంత్రి మోదీ స్పందిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో భారత్ తన దృఢమైన సంబంధాలను కొనసాగించిందని గుర్తుచేశారు. పెజెష్కియాన్‌ను శాంతికాముకుడిగా అభివర్ణించిన మోదీ, శాంతి స్థాపనలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు యుద్ధం ద్వారా లబ్ధి పొందాలని చూస్తారన్న విషయాన్ని అంగీకరిస్తూనే, శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తుదకు శాంతే విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధిలోని లారక్ ద్వీపంలో ఇరాన్ లాంచర్లపై అమెరికా దాడి చేయడం, దానికి ప్రతిచర్యగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. బాహ్య ఒత్తిళ్లు ఉన్నప్పటికీ రవాణా, సముద్రయాన రంగాల్లో భారత్‌తో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ స్పష్టం చేసింది.

## రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా? కూనంనేని సంచలన వ్యాఖ్యలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని అన్నారు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అధికారం, హక్కులతో పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు చేయడం సహజమేనని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో భూ సమస్యలపైనా కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.





# ప్రతి ఒక్క ఓటును కాపాడాల్సిన బాధ్యత బీఎల్‌ఏలదే

## నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

## ఎస్ఐఆర్ ఫేజ్--2పై బీఎల్‌ఏలకు ప్రత్యేక శిక్షణ

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఫేజ్--2 ప్రక్రియపై బీఎల్‌ఏలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గాంధీ భవన్ నుంచి విచ్చేసిన మాస్టర్ ట్రైనర్ మరియు ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ శ్రీ మాణిక్యం మల్లేష్ యాదవ్ గారు బీఎల్‌ఏలకు ఎస్ఐఆర్ ఫేజ్--2లో చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు. తమ తమ పరిధిలోని ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించడం, అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి జాబితాలో నమోదు చేయించడం, అవసరమైన సవరణలు చేయించడం, ఓటర్ల వివరాలను పరిశీలించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు పాల్గొని ఎస్ఐఆర్ ఫేజ్--2 ప్రక్రియపై బీఎల్‌ఏలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ పరిధిలో ఓటరు జాబితాను బాధ్యతగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడే విధంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్‌ఏలు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎస్ఐఆర్ ఫేజ్--2 ప్రక్రియను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా పూర్తి చేయడానికి ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని బీఎల్‌ఏలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశా వేడుకల్లో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి





నారాయణఖేడ్ నియోజకవర్గం : కంగ్టి మండల పరిధిలోని ఎడ్ల రేగడి తండాకు చెందిన జమున బాయి భర్త కమల్ సింగ్, పవర్ అనిత బాయి భర్త సురేష్లు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు పాల్గొని, లబ్ధిదారుల కుటుంబాలను అభినందించారు. ఎమ్మెల్యే గారు తండాకు చేరుకోగానే గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గారు నూతన గృహాల్లోకి వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ... ఎడ్ల రేగడి తండాలో గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ హయాంలో అనేక కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాల బలోపేతం తదితర కార్యక్రమాల ద్వారా మహిళల జీవితాల్లో ప్రభుత్వం మార్పు తీసుకువస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు ఒక గొప్ప కల అని, ఆ కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రావు సింగ్, బలరామ్, శివాజీ పాటిల్ సర్పంచ్, పండరి రెడ్డి, దత్తు గౌడ్ మాజీ ఎంపీటీసీలు,రాములు, జగదీష్, సర్దార్,కుమార్ సింగ్నారాయణ,సురేష్,పురం, ధనరాజ్, రంజీ,బాల్ సింగ్,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల్లో కూకట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆదర్శంగా నిలవాలి

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో లయన్స్ ఇంటర్నేషనల్ 320D గవర్నర్ డాక్టర్ విజయలక్ష్మి






కూకట్‌పల్లి, ఆగస్టు 31 (అరుణ ప్రభ) సమాజ సేవలో కూకట్‌పల్లి లయన్స్ క్లబ్ మరింత ముందంజలో నిలవాలని లయన్స్ ఇంటర్నేషనల్ 320ఐ గవర్నర్ డాక్టర్ విజయలక్ష్మి ఆకాంక్షించారు. గత ఏడాది నిర్వహించిన సేవా కార్యక్రమాల స్ఫూర్తితో 2026--27 సంవత్సరంలోనూ విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. కూకట్‌పల్లి లయన్స్ క్లబ్ నిర్వహించే కార్యక్రమాలు ఇతర లయన్స్ క్లబ్‌లకు ఆదర్శంగా నిలిచేలా సేవా కార్యక్రమాలను రూపొందించుకోవాలని ఆమె కోరారు. కూకట్‌పల్లి లయన్స్ క్లబ్ 2026--27 సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార (ఇన్‌స్టాలేషన్) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ విజయలక్ష్మి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్‌లు సేవా కార్యక్రమాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని అన్నారు. సమాజంలోని అవసరమైన వర్గాలకు అండగా నిలవడంతో పాటు విద్య, వైద్యం, ఆరోగ్యం, పేదలకు సహాయం తదితర రంగాల్లో సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కూకట్‌పల్లి లయన్స్ క్లబ్ గతంలో చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తూ, రానున్న రోజుల్లో మరిన్ని వినూత్న సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

### నూతన కార్యవర్గం

2026--27 సంవత్సరానికి కూకట్‌పల్లి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గంగా అధ్యక్షుడిగా లయన్ వెంకటరెడ్డి యక్కంటి, కార్యదర్శిగా లయన్ శ్రీనివాసరెడ్డి గువ్వల, కోశాధికారిగా లయన్ శ్రీనివాసరెడ్డి కుర్రె బాధ్యతలు స్వీకరించారు. నూతన కార్యవర్గ సభ్యులు క్లబ్ అభివృద్ధికి, సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్ అమరనాథ రావు, లయన్ సూర్య రాజు, లయన్ నరసింహరావు, లయన్ పద్మావతి, లయన్ సుజాత, లయన్ ప్రఫుల్లా రెడ్డి, లయన్ సంతోష్ కుమార్, లయన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గానికి అభినందనలు

ప్రమాణ స్వీకారం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు. 2026--27 సంవత్సరంలో క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, కూకట్‌పల్లి ప్రాంతంలోనే కాకుండా సమాజ సేవలో ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేస్తూ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని పలువురు సభ్యులు సూచించారు.





# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. భవిష్యత్తు చక్కదిద్దుకోవాలి

## క్రీడాకారులు నైపుణ్యత చాటుకోవాలి

## డ్రగ్స్ అంతం మన పంతం నినాదంతో ముందుకు వెళ్తామన్న బుడిద రామ్ రెడ్డి

అరుణ ప్రభ 30 : ఇబ్రహీంపట్నం జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీల బహుమాన ప్రదానోత్సవం జరిగింది.. డ్రగ్స్ అంతం మన పంతం అనే నినాదం తో ముందుకు వెళ్తున్న బి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పరి గూడా లో వాలీబాల్ క్రీడ ఉత్సవాలు ప్రారంభించుకొని గత నెల రోజుల నుంచి బి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు విద్యార్థినీలు క్రీడాల నైపుణ్యత కోసం పెంపొందించేందుకు క్రీడలు నిర్వహిస్తూ క్రీడల వల్ల యువత ఎంతో తోడ్పాటు ఇస్తుందని క్రీడల వల్ల మనం ప్రతిష్టంగా బలోపేతంగా శారీరకంగా బలంగా దృఢత్వంగా కావాలని క్రీడలు నిర్వహిస్తూ రేపు రేపు రాబోయే రోజుల్లో యువత మునుముందుకు వెళ్లాలని మంచి ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించాలని తల్లిదండ్రులను గౌరవించే విధంగా ఉండాలని అందుకే బిఆర్ఆర్ లక్ష్యం ఆయన తెలిపారు. క్రీడా రంగానికి మైదానం ఏర్పాటు చేసే విధంగా కూడా చూస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేస్తున్న బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేతుల మీదుగా ప్రధమ బహుమతి మంచాల మండలం పి సీ తండా కైవసం రూ.51 వేయి, ద్వితీయ బహుమతి యాచారం మండలం చింతపట్ల రూ. 31 వేయి, తృతీయ బహుమతి ఇబ్రహీంపట్నం సీతారాంపేట్ నాలుగో బహుమతి అబ్దుల్లాపూర్మెట్ కైవసం చేసుకుని విద్యార్థిని విద్యార్థులు చైర్మన్ బూడిద రామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘువ రెడ్డి, సిఐ. ఏడుకొండలు, ఉప్పరిగూడ సర్పంచ్ శ్రీవేణి నందకుమార్, ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, సుశీల, పోల్కంపల్లి మాజీ ఎంపీటీసీ మంగా రవీందర్, బూడిద నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు...



## నూతన వస్త్రధారణ వేడుకల్లో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మండల పరిధిలోని హంగిర్గ(ఖ) గ్రామ ఆప్తులు బాపు మల్శెట్టి గారి కుమార్తెల యొక్క నూతన వస్త్రధారణ మహోత్సవ వేడుకల్లో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన గౌరవ నారా యణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ఈ కార్యక్రమంలో వారితో పాటు తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు పండు రెడ్డి. తయా ర్. పాల్గొన్నారు.




## సేవకు దక్కిన గౌరవం.. రేవల్లె మదన్‌కు డాక్టరేట్

ప్రముఖ సామాజిక కార్యకర్త అబ్దుల్లాపూర్ మెట్ మం..పెద్ద అంబర్పేట్, కలానగర్ చెందిన రేవల్లె మదన్ ( మస్తాన్) గారికి గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రధానం చేయడం జరిగింది. నిస్వార్థమైన సేవ చేసే వారికి ఎప్పుడైనా ఎక్కడైనా గౌరవం ఉంటుందని అమెరికాలోని న్యూజెర్సీలోని యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్ షిప్ అండ్ ఎక్సెలెన్స్ డైరెక్టర్ మరియు తమిళనాడు న్యాయవ్యవస్థ మాజీ న్యాయమూర్తి గౌరవనీయ డా. కె. వెంకటేశన్ గారు శనివారం ఉదయం 11 గంటలకు లి తమిళనాడు పాండిచ్చేరిలో గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందించే కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగాలిశ్రీ పి.ఆర్. శంపత్, ఐ.ఏ.ఎస్. తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రిటైర్డ్) గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా కంట్రీ డైరెక్టర్ సుకుమార్ గారు, మరియు డిప్యూటీ డైరెక్టర్ విజయ మోహన్ గారు, మరియు యూనివర్సిటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నర్సింహా గౌడ్,లి గారు పాల్గొనడం జరిగింది . సమాజ సేవలో ట్రీ సొసైటీ, చైర్మన్,రేవల్లె మదన్ గారు,తన ట్రీస్ సొసైటీ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్. ఒకేషనల్ ట్రైనింగ్, ఎన్విరాన్మెంటల్ ప్రోగ్రామ్స్, మరియు ట్రీస్ ప్లాంటినేషన్, హెల్త్ క్యాంప్స్, స్వచ్ఛ సర్వేక్షణ, ,స్వచ్ఛభారత్, మరియు విద్య,వైద్యం,బాలల హక్కుల పరిరక్షణ,మరియు సామాజిక సేవ కార్యక్రమాలలో గత కొన్ని సంవత్సరాల నుండి ఈ యొక్క సామాజిక సేవ కార్యక్రమాలలో, చురుగ్గా చేస్తు,సమాజ సేవలో ఆయన అందిస్తున్న విశేష సేవలకు, గుర్తింపుగా ,యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ పర్ లీడర్ షిప్ అండ్ ఎక్సలెన్స్, సంస్థ ఆయనకు ప్రతిష్టాత్మక, ,గౌరవ డాక్టరేట్, అవార్డును,ప్రధానం చేయడం జరిగింది,



## హెచ్‌డబ్ల్యూఓలతో సమీక్ష సమావేశం నిర్వహించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని హెచ్‌డబ్ల్యూఓలతో (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు) గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మెరుగైన భోజనం మరియు వసతి సౌకర్యాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, తాగునీరు, వసతి, భోజనం వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు మరియు సదుపాయాలు ప్రతి అర్హులైన విద్యార్థికి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఇంటి వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని హెచ్‌డబ్ల్యూఓలకు సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని హెచ్‌డబ్ల్యూఓలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

అరుణప్రభ 31 ఆగస్ట్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ వేద పండితులు తాటిపాముల నృసింహ మూర్తి మనవడు మారేపల్లి కౌశిక్ శర్మ – సుమశ్రీ వివాహానికి మినీ పి ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ నాయిని రంజిత్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్,వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ నాయక్ మండల మాజీ ఎంపీపీ మౌనిక సురేందర్ ,మాజీ కో ఆప్షన్ ఎండీ షరీఫ్ మాజీ ఎంపీటీసీ బత్తిని అనిల్,మండల యూత్ అధ్యక్షులు బానోత్ దాము నాయక్,మాజీ సర్పంచ్ భూక్యా మల్సూర్ నాయక్ బొబ్బ వెంకటరెడ్డి మండల యూత్ నాయకులు బానోత్ నవీన్ నాయక్ గారు, తదితరులు పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
మంగళవారం, 1 సెప్టెంబరు, 2026

# కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాటను విజయవంతం చేయాలి

## రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి





అరుణప్రభ 31 ఇబ్రహీంపట్నం : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న కాంగ్రెస్ 420 మోసాలపై పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో జిల్లా పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, దాదాపు 1000 రోజులు గడుస్తున్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై ఈ సమావేశంలో చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న కార్యక్రమాలను ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పటిష్టంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు, ఎన్నికల హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రతి గ్రామానికి, ప్రతి ప్రజానీకానికి చేరవేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌తో నెరవేరిన సొంతింటి కల

## 16 నియోజకవర్గాల్లో 7,340 ఫ్లాట్ల కేటాయింపు

## నాలుగు రోజుల పాటు కొనసాగిన లాటరీ ప్రక్రియ

## పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఎంపిక

హైదరాబాద్, ఆగస్టు 31: అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలోని అల్పాదాయ వర్గాల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌లో 7,340 మందికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. నగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన లాటరీ ప్రక్రియ సోమవారం ముగిసింది. రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగస్టు 28న లాటరీ ద్వారా ఇళ్ల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం మినహా మిగిలిన 15 నియోజకవర్గాల్లో 480 ఇళ్ల చొప్పున కేటాయించారు. కంటోన్మెంట్ పరిధిలో తొలివిడతలో 140 ఇళ్లను మాత్రమే నిర్మిస్తున్నందున ఆ సంఖ్యలోనే ఇళ్లను కేటాయించారు. ప్రతి నియోజకవర్గంలో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న వారికే ఇళ్లు కేటాయించాలన్న ఉద్దేశంతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పైలట్ ప్రాజెక్టులను చేపట్టి, హౌసింగ్ బోర్డు ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. ఇలా అందుబాటులో ఉన్న స్థలాల్లో ప్రతిపాదించిన మొత్తం 7,340 ఇళ్లకు 60,720 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక పరిశీలనలో అర్హులైన వారి పేర్లతో పూర్తి పారదర్శకంగా, నిష్పాక్షికంగా, బహిరంగంగా లాటరీ నిర్వహించి ఇళ్లను కేటాయించారు. ఆగస్టు 28 నుంచి 31 వరకు ఆయా నియోజకవర్గాల్లోనే దరఖాస్తుదారులు, అధికారుల సమక్షంలో లాటరీ ప్రక్రియ కొనసాగింది. లాటరీ నిర్వహణ ప్రక్రియపై దరఖాస్తుదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. లాటరీ ద్వారా ఇళ్లు పొందిన కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ**

అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో మొత్తం 25 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 16 నియోజకవర్గాల్లో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. మరో నాలుగు నియోజకవర్గాల్లో ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా త్వరలో విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**ఆన్‌లైన్‌లో వివరాలు.. అభ్యంతరాల స్వీకరణ**

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో లాటరీ ద్వారా ఇళ్లు పొందిన వారి వివరాలన్నింటినీ tghb.telangana.gov.in వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. ఎంపికైన వారిపై ప్రజలు తమ అభ్యంతరాలను తెలియజేసే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. అభ్యంతరాలను కూడా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చన్నారు. లాటరీలో ఎంపికైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించేందుకు అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతుందని తెలిపారు. పూర్తి పారదర్శకంగా, అర్హులైన వారికే ఇళ్లు లభించేలా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. లాటరీలో ఇళ్లు పొందిన వారు క్షేత్రస్థాయిలో తమ ఇళ్లకు వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు.

**త్వరలో మరిన్ని ప్రాజెక్టులు**

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కోసం దరఖాస్తు చేసుకుని లాటరీ ప్రక్రియలో ఇళ్లు రాని వారు నిరుత్సాహం చెందవద్దని బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతం సూచించారు. త్వరలోనే మరిన్ని ప్రాజెక్టులను చేపడతామని, వాటిలో ఇళ్లు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన వారికి ఇళ్లను నిర్మించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఆయన వివరించారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా సెక్రెటరీగా రాంపల్లి యాదగిరి గౌడ్

**ప్రజా సమస్యలపై పోరాటం, పార్టీ నిర్ణయాలు అమలు చేయడమే ఆయన ప్రత్యేకత**

**సామాన్య కార్యకర్త నుంచి జిల్లా స్థాయి ఎదిగిన నాయకుడు రాంపల్లి యాదగిరి గౌడ్**

**మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం సైనికుడిల కృషి చేస్తా: రాంపల్లి యాదగిరి గౌడ్**



ఆగస్టు 31,అరుణ ప్రభ : సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ,ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రాంతీయ నాయకుడిగా ఎదిగిన రాంపల్లి యాదగిరి గౌడ్‌కు బీజేపీ మరో కీలక బాధ్యత అప్పగించింది. భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా సెక్రెటరీగా రాంపల్లి యాదగిరి గౌడ్ ను నియమించింది. ఈ నియామకం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక మలుపుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పీర్జాదిగూడ ప్రాంతంలో పార్టీ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం నాయకుడిగా, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించే స్థాయికి చేరింది. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల్లో ఉండటం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తూ నిబద్ధతగల పార్టీ కార్యకర్తగా ఆయన రాజకీయ శైలి ఉంటుంది.ప్రజా సమస్యలపై పోరాటమే ఆయనకు ప్రత్యేక గుర్తింపు,రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఆయన ఎదుగుదల ఒక్కసారిగా వచ్చింది కాదు. పార్టీ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొంటూ, కార్యకర్తలతో కలిసి పనిచేస్తూ, స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండటం, అందరికీ తలలో నాలుకల మెలగడం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. పీర్జాదిగూడ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సమస్య పరిష్కారం అయ్యే వరకు వాటిపై ఫాలోఅప్ చేయడం ఆయన పని తీరులో ఒక భాగంగా మారింది. రోడ్లు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ప్రజలకు సంబంధించిన స్థానిక సమస్యలపై స్పందిస్తూ ప్రజల మధ్య ఉండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజా సమస్యల విషయంలో అందరితో కలిసి పనిచేసే విధానం ఆయనకు మరింత గుర్తింపుని తీసుకొచ్చింది.

**పీర్జాదిగూడ నుంచి జిల్లా స్థాయికి:**

ఒక ప్రాంతానికి పరిమితమైన కార్యకర్తగా ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం. ఇప్పుడు మేడ్చల్ జిల్లా స్థాయి బాధ్యత వరకు చేరింది. ఈ పరిణామం వెనుక పార్టీ పట్ల ఆయన చూపిన విధేయతతో పాటు, క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవం కూడా కీలకంగా మారింది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిలో బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఇప్పుడు జిల్లా స్థాయిలో పార్టీ కార్యక్రమాలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఓబీసీ మోర్చా బాధ్యతలు రావడంతో వెనుకబడిన వర్గాల సమస్యలు, వారి రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ అంశాలను పార్టీ వేదికగా మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆయనపై పడింది.

**ఓబీసీ మోర్చా బాధ్యతతో పెరిగిన బాధ్యత:**

మేడ్చల్ జిల్లాలో ఓబీసీ వర్గాలను పార్టీతో మరింత అనుసంధానం చేయడం, క్షేత్రస్థాయిలో ఓబీసీ కార్యకర్తలను సమన్వయం చేయడం, వారి సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాల్లో కొత్తగా నియమితులైన జిల్లా సెక్రెటరీగా రాంపల్లి యాదగిరి గౌడ్‌కు కీలక బాధ్యతలు ఉండనున్నాయి. ఇప్పటివరకు స్థానిక స్థాయిలో ప్రజలతో ఉన్న అనుబంధాన్ని జిల్లా స్థాయికి విస్తరించాల్సిన అవసరం కూడా ఆయన ముందుంది. పార్టీ బలోపేతంతో పాటు ఓబీసీ మోర్చాను గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిల్లో మరింత క్రియాశీలం చేయడం ఆయనకు ప్రధాన సవాలుగా మారనుంది.

**నాపై నమ్మకం ఉంచిన నాయకత్వానికి కృతజ్ఞతలు: రాంపల్లి యాదగిరి గౌడ్**

కొత్త బాధ్యతలు దక్కిన సందర్భంగా రాంపల్లి యాదగిరి గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, ముఖ్యంగా ఓబీసీ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు వై. మహేందర్ యాదవ్‌తో పాటు సుజాత నాయుడు, సుగుణ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ గోనె శ్రీనివాస్, లక్ష్మి, అమర్ మోహన్ రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తానని, ఓబీసీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా వాటిని గెలిపించేందుకు ఒక సైనికుడిలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రాంపల్లి యాదగిరి గౌడ్‌కు జిల్లా స్థాయి బాధ్యతలు దక్కడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుచరులు శుభాకాంక్షలు తెలిపారు.

# చెంగిచెర్లలో ఘనంగా బసవేశ్వర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏనుగు సుదర్శన్ రెడ్డి

## ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి నాయకులు





ఆగస్టు 31, అరుణ ప్రభ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల డివిజన్ పరిధిలో మహాత్మా శ్రీ గురు బసవేశ్వర విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 12వ శతాబ్దపు మహనీయుడు, తత్వవేత్త, సంఘ సంస్కర్త అయినా మహాత్మా బసవేశ్వరుడు సమాజంలో సమానత్వం, మానవత్వం, సామాజిక న్యాయం కోసం విశేషంగా కృషి చేశారని అన్నారు. కర్ణాటకలోని బసవకల్యాణంలో బసవన్న స్థాపించిన అనుభవ మంటపం ప్రపంచంలోనే తొలి ఆధ్యాత్మిక ప్రజాస్వామ్య వేదికగా ప్రసిద్ధి చెందిందన్నారు. అనుభవ మంటపంలో యోగులు, సాధువులు, తత్వవేత్తలు, ఆధ్యాత్మికత, నైతిక విలువలు, సామాజిక సమానత్వం వంటి అంశాలపై చర్చించేవారని, కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా స్త్రీ, పురుషులందరికీ సమానంగా అవకాశం కల్పించడం బసవేశ్వరుని గొప్పతనానికి నిదర్శనమన్నారు. బసవేశ్వరుని సమానత్వం, సామాజిక న్యాయం, మానవతా విలువలు నేటి సమాజానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల డివిజన్ బిజెపి అధ్యక్షుడు ఏర్పుల మహేష్, రాష్ట్ర నాయకులు రామ్ యాదవ్, బీజేపీ యువమోర్చా నాయకులు బండారి పవన్ రెడ్డి, హరీష్, గండిపల్లి రాజు, పీర్జాదిగూడ అధ్యక్షులు ప్రభాకర్, తుప్పత్ ఆనంద్, గొల్లపూడి శ్రీనివాస్, జమ్మ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో బిజెపి పార్టీని మరింత బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి

## మానుకోట జిల్లా పార్టీ సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావుతో చర్చ

అరుణప్రభ 31 ఆగస్ట్ మహబూబాబాద్ అర్బన్ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు ని మానుకోట జిల్లా బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో పార్టీ సంస్థాగత విషయాలపై పూర్తిస్థాయిలో చర్చించారు. ఈ సందర్భంగా మానుకోట జిల్లాలో పార్టీ సంస్థాగత నిర్మాణం, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం తదితర అంశాలపై రాష్ట్ర అధ్యక్షులతో చర్చించారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలు మరియు విధానాలను ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయికి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా చర్చ జరిగినట్లు నాయకులు తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మానుకోట జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు, బీజేపీ మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దిద్ది మహేష్, బీజేపీ జిల్లా నాయకులు గాడిపెల్లి శ్యామ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

## కిషన్ నాయక్ ను సత్కారించిన ఎంపీ బలరాం నాయక్

అరుణప్రభ 31 ఆగస్ట్ మహబూబాబాద్ అర్బన్ : ఇటీవలన నూతనంగా నియామకం కాబడిన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుగులోతు కిషన్ నాయక్, ఈరోజు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ ని ఎంపీ క్యాంప్ ఆఫీసులో సాదరంగా కలవగా, కిషన్ నాయక్ ని ఎంపీ బలరాం నాయక్ శాలువలతో సన్మానించడం జరిగింది, కిషన్ నాయక్ తో పాటు మరో సభ్యులు రజనీకాంత్ ని కూడా సన్మానించడం జరిగింది, తదుపరి బలరాం నాయక్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఎస్సీ ఎస్టీ హక్కుల కోసం చట్టాలు అమలు కోసం ఎస్సీ ఎస్టీల సంక్షేమం కోసం ఎస్సీ ఎస్టీల రక్షణ కోసం సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు అయ్యేలా కృషి చేయాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులకు కిషన్ నాయక్ కి సూచించారు



# హత్య కేసులో ముద్దాయి కి జీవిత ఖైదు

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): : గూడూరు పట్టణంలో 2023 సంవత్సరంలో జరిగిన కామేష్ అనే వ్యక్తి హత్య కేసులో ముద్దాయి జోగేంద్ర పై నేరం రుజువు కావడంతో ఏడవ అదనపు జిల్లా జడ్జ్ ముద్దాయికి జీవిత ఖైదు 5 వేల రూపాయల జరిమానా విధించారు .సోమవారం గూడూరు పట్టణంలోని కోర్టు హాల్లో ఏపీపీ వసంత్ కుమార్ మాట్లాడుతూ 2023 సంవత్సరంలో రైల్వే ఆర్ఎంఎస్ ఆఫీసు వద్ద కామేష్ అనే వ్యక్తి నిద్రిస్తుండగా పాత కక్షలతో జోగేంద్ర అనే వ్యక్తి బండరాయితో తలపై కొట్టి హత్య చేశాడు అన్నారు. ముద్దాయి జోగేంద్ర హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో ఏడవ అదనపు జిల్లా జడ్డి వెంకట నాగ పవన్ ముద్దాయికి జీవిత ఖైదు అయిదు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారన్నారు. ఈ తీర్పుతో సామాన్యులకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగిందని పేర్కొన్నారు . ఈ కేసులో అప్పటి విచారణ అధికారి హజరత్ బాబు లైసెనింగ్ ఆఫీసర్ మల్లికార్జున్ సుబ్రహ్మణ్యం సాక్షాలను సకాలంలో కోర్టుమందు ఉంచారని వెల్లడించారు.

# సర్ పై సమీక్షా..



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణం లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ రేఖ రాణి సర్ అంశంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో తో పాటు ఇతర తాసిల్దార్ లు రెవెన్యూ సిబ్బంది పలు అంశాలపై ఆమెతో చర్చించారు... ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా లెక్కలతో పోలిస్తే 95% అప్లికేషన్లు వచ్చినట్లు తెలిపారు. సోమవారం సర్ ప్రక్రియ ముగుస్తుందని ఆమె వెల్లడించారు.మిగిలిన అప్లికేషన్లు అక్టోబర్ నుంచి జనవరి వరకు మరోసారి పరిశీలించేందుకు ఎన్నికల సంఘం గడువు ఇస్తుందని పేర్కొన్నారు. అధికారులు సర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు.. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణ కుమారి , తహసీల్దార్ ఆర్.వి. ప్రసాద్ , పురపాలక కమీషనర్ మల్లికార్జున్ రావు , తదితరులు పాల్గొన్నారు

# వర్గమూలాల వెనుక మనిషి మర్మం

## జిందం అశోక్ 'వర్గమూలాలు' కవిత్వంపై సమీక్ష: డా పెరుక రాజు

సమాజం బయట కనిపించేది ఒక రూపం లోపల మరిగేది మరో రూపం. వీధిలో నిశ్శబ్దం కనిపించవచ్చు, కానీ మనుషుల గుండెల్లో అసంతృప్తి ఉప్పొంగుతుండవచ్చు. అభివృద్ధి అనే పదం వెలుగులా మెరవవచ్చు, కానీ అదే వెలుగు వెనుక కొన్ని బతుకులు నీడలుగా మిగిలిపోవచ్చు. ఆ నీడలను గుర్తించి, వాటి వెనుక దాగి ఉన్న మూలకారణాలను వెతకడం నిజమైన సామాజిక కవిత్వం పని. జిందం అశోక్ రచించిన 'వర్గమూలాలు' అలాంటి శోధనా స్వభావం కలిగిన కవితా సంపుటి.

56 కవితలు, 116 పుటలుగా విస్తరించిన ఈ గ్రంథం కేవలం అనుభూతుల సమాహారం కాదు. గత రెండు దశాబ్దాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మార్పులను ఒక సున్నితమైన మనసు ఎలా గ్రహించిందో తెలిపే అక్షర దస్తావేజు. రైతు బాధ, చేనేత కార్మికుడి నిస్సహాయత, నిర్వాసితుడి కన్నీరు, ఓటరి దౌర్భాగ్యం, యువతపై బాధ్యత, ప్రకృతి విధ్వంసం, సాంకేతిక బానిసత్వం, తెలంగాణ ఉద్యమ జ్వాల ఇవి అన్నీ ఈ సంపుటిలో విడివిడిగా కనిపించినా చివరకు ఒకే ప్రశ్నవైపు చేరుతాయి. మనిషి ఎటు వెళుతున్నాడు?

'వర్గమూలాలు' అనే శీర్షికలోనే కవి దృష్టి అంతర్లీనంగా ఉంది. పైపై రూపాన్ని చూసి తీర్పు చెప్పకుండా, ప్రతి సంఘటనకు కారణమైన సామాజిక నిర్మాణాన్ని వెతకడం అతని అలవాటు. బాధను వర్ణించడం మాత్రమే కాదు, బాధను ఉత్పత్తి చేసే వ్యవస్థను గుర్తించడం అతని కవిత్వంలోని ప్రధాన లక్షణం. అందువల్ల అశోక్ కవిత్వం సానుభూతి దగ్గర ఆగిపోదు; అది అవగాహనకు, అక్కడి నుంచి ప్రశ్నకు, ప్రశ్న నుంచి ప్రతిఘటనకు ప్రయాణిస్తుంది.

ముంపు గ్రామాలపై వచ్చిన కవితల్లో ఈ స్వరం మరింత గాఢంగా వినిపిస్తుంది. ఒక ప్రాజెక్టు నిర్మాణం ప్రభుత్వ గణాంకాల్లో విజయంగా నమోదు కావచ్చు. కానీ ఆ నీటి అడుగున మునిగిపోయిన ఊరి పేరు, ఆ ఊరి మట్టిలో నిక్షిప్తమైన బాల్యం, ఆ చెట్టు నీడ, ఆ ఇంటి ముంగిట, ఆ శ్మశానంలోని పూర్వీకుల జ్ఞాపకాలు ఏ పట్టికలో నమోదు అవుతాయి? అభివృద్ధికి మనిషి చెల్లిస్తున్న భావోద్వేగ ధరను కవి గుర్తుచేస్తాడు. నేలను కోల్పోవడం అంటే చిరునామాను మాత్రమే కోల్పోవడం కాదు ఒక అంతరంగ ప్రపంచాన్ని కోల్పోవడం అనే విషాదాన్ని అశోక్ హృదయానికి హత్తుకునేలా చూపిస్తాడు.

చేనేత జీవితం, ముఖ్యంగా సిరిసిల్ల వంటి ప్రాంతాల సామాజిక వేదన, కవి కళ్లలో ఆర్థిక సమస్యగా మాత్రమే కనిపించదు. అది శ్రమకు గౌరవం దక్కని వ్యవస్థపై ఒక అభియోగ పత్రంలా మారుతుంది. చేతులతో వస్త్రం నేసే మనిషి తన జీవితాన్ని మాత్రం ఎందుకు నేసుకోలేకపోతున్నాడన్న మౌన ప్రశ్న ఈ కవితల్లో పొంగిపొర్లుతుంది. రైతు చెమట, కార్మికుడి చేతివేళ్లు, పేద మనిషి ఆకలి ఇవన్నీ అశోక్ వద్ద కవితా వస్తువులు కాదు సామాజిక సాక్ష్యాలు.

ఈ సంపుటిలో ఆధునిక జీవనశైలిపై కవి చేసిన వ్యాఖ్యలు కూడా ప్రత్యేకంగా నిలుస్తాయి. మొబైల్ ఫోన్, టెలివిజన్, పదవులు, మద్యం, అలవాట్లు బానిసత్వం రూపం మారినా స్వరూపం మారలేదని కవి గుర్తుచేస్తాడు. సాంకేతికత మనిషిని ప్రపంచానికి దగ్గర చేసింది కానీ పక్కనే ఉన్న మనిషి నుంచి దూరం చేసింది. స్క్రీన్ ముందు గంటల తరబడి జీవించే వ్యక్తి, ఇంటి వారితో కొన్ని నిమిషాలు మాట్లాడటానికి కూడా ఆసక్తి చూపని స్థితి ఆధునిక నాగరికతలోని విచిత్ర విరోధాభాసం.

పర్యావరణ విధ్వంసంపై అశోక్ స్వరం మరింత పదునెక్కుతుంది. గుట్టలు మాయం కావడం, ఇసుక దోపిడి, నదుల స్వరూపం మారడం, ప్రకృతి వనరుల దోపిడీ ఇవన్నీ కేవలం పర్యావరణ అంశాలు కావని, అవి మనిషి భవిష్యత్తును తినేస్తున్న నిశ్శబ్ద విపత్తులని ఆయన సూచిస్తాడు. ప్రకృతిని నాశనం చేయడం అంటే చివరకు మన జీవనాధారాలనే కొరుక్కోవడమని కవిత్వం హెచ్చరిస్తుంది.

తెలంగాణ మలిదశ ఉద్యమ నేపథ్యంలోని కవితలు ఈ సంపుటికి చారిత్రక స్పందనను జోడిస్తాయి. ఒక ప్రాంతపు స్వాభిమాన పోరాటాన్ని అశోక్ నినాదాల స్థాయిలో కాకుండా, ప్రజల భావోద్వేగాల స్థాయిలో అనుభవించాడు. ఉద్యమ త్యాగాలు, యువత ఆవేదన, నేల పట్ల అనుబంధం, భాషా గర్వం ఇవన్నీ అతని కవిత్వంలో ప్రజాస్మృతిగా నిలుస్తాయి. డప్పు మోగిన శబ్దం, గజ్జెల సవ్వడి, వీధుల్లో వినిపించిన నినాదం అన్నీ కవితలో చరిత్రకు హృదయ స్పందనలుగా మారతాయి.

అశోక్ కవిత్వంలోని మరో ఆకర్షణీయమైన అంశం అతని శైలీ స్వచ్ఛత. అతను కావాలని భాషను క్లిష్టం చేయడు. పదాల మీద ఆర్భాటం చూపడు. భావాన్ని దాచిపెట్టి పాఠకుణ్ణి అయోమయంలో పడేయడు. చెప్పదలచుకున్నది నేరుగా చెప్తాడు. కానీ ఆ సరళత లోపల సూటి వ్యంగ్యం, గాఢమైన సామాజిక అవగాహన, సందర్భానుసారమైన పదచిత్రాలు సహజంగా చేరతాయి. 'ఆక్సిజన్ స్థూపమాలిక', 'విత్తన గుళిక', 'పిడికిళ్ల నడకలు' వంటి ప్రయోగాలు ఆయన కవిత్వంలోని సృజనాత్మక వైవిధ్యాన్ని తెలియజేస్తాయి.

'సుప్రభాతం', 'ఆకుపచ్చని బంగారం' వంటి కవితలు ఈ కవిలోని మృదుత్వాన్ని కూడా పరిచయం చేస్తాయి. సామాజిక ఆగ్రహంతో పాటు వ్యక్తిగత అనుభూతి, ప్రకృతి పట్ల మమకారం, మానవ సంబంధాల వేడి కూడా అతని కవిత్వంలో సమానంగా ప్రవహిస్తాయి. అందువల్ల 'వర్గమూలాలు' ఒకే స్వరంతో సాగిపోయే సంపుటి కాదు; ఆగ్రహం, ఆవేదన, వ్యంగ్యం, తాత్త్వికత, ప్రేమ, జ్ఞాపకం---అన్నీ కలిసిన బహుస్వర కవితా అనుభవం.

జిందం అశోక్ కవిత్వంలో అత్యంత విలువైన అంశం అతను సమస్యను చూపించి చేతులు దులుపుకోకపోవడం. సమాజంలో అవినీతి ఉందని చెబుతూనే నీతివంతమైన యువతను కోరుకుంటాడు. వ్యవస్థ నిర్లక్ష్యాన్ని విమర్శిస్తూనే వ్యక్తిగత బాధ్యతను గుర్తుచేస్తాడు. చీకటిని శపించడమే కాదు, మనిషే దీపస్తంభంగా నిలవాలని సూచిస్తాడు. ఇదే ఆయన కవిత్వాన్ని నిరాశా గీతంగా కాకుండా చైతన్య గీతంగా నిలబెడుతుంది.

'అదృశ్య కిరణాలు', 'మానేరు నానీలు', 'ఎనగర్ర', 'గవ్వలు', 'చుక్కపొద్దు' వంటి రచనలతో ఇప్పటికే తనదైన సాహిత్య పయనాన్ని నిర్మించుకున్న జిందం అశోక్, 'వర్గమూలాలు'తో ఆ ప్రయాణాన్ని మరింత సామాజిక లోతుకు తీసుకెళ్లాడు. ఈ సంపుటి అతని వ్యక్తిగత అభిప్రాయాల సమాహారం మాత్రమే కాదు; ఒక కాలానికి సంబంధించిన మానసిక వాతావరణాన్ని నమోదు చేసిన సృజనాత్మక సాక్ష్యం.

కవిత్వం పాఠకుడిని ఒప్పించాల్సిన అవసరం లేదు. కానీ అతన్ని ఆలోచింపజేయాలి. అతని సౌకర్యవంతమైన నిశ్శబ్దాన్ని కొద్దిగా అయినా కదిలించాలి. అతను చూసి కూడా చూడనట్టు వదిలేసిన దృశ్యాన్ని మళ్లీ అతని ముందుంచాలి. ఆ ప్రమాణంతో చూస్తే 'వర్గమూలాలు' తన బాధ్యతను నెరవేర్చిన సంపుటి.

ఈ కవితలన్నిటినీ కలిపి చదివినప్పుడు ఒక అంతర్లీన సందేశం స్పష్టమవుతుంది---మనిషిని నిర్ణయించేది అతని పేరు, వర్గం, పదవి మాత్రమే కాదు; అన్యాయం ముందు అతను తీసుకునే వైఖరి. యువత ప్రశ్నించాలి, సమాజం స్పందించాలి, కవిత్వం మౌనానికి ప్రత్యామ్నాయంగా నిలవాలి అన్న ఆకాంక్ష ఈ పుస్తకమంతా ప్రవహిస్తుంది.

కొన్ని కవితలు పూల్లా పరిమళిస్తాయి.
కొన్ని కవితలు దీపాల్లా వెలుగుతాయి.
కొన్ని కవితలు మాత్రం మన చేతిని పట్టుకుని---




"నీవు చూస్తున్న సమాజం వెనుక ఉన్న మూలాలను కూడా చూడు" అని ప్రశ్నిస్తాయి.

జిందం అశోక్ 'వర్గమూలాలు' అలాంటి ప్రశ్నించే కవిత్వం.

**పుస్తకం: వర్గమూలాలు, రచయిత: జిందం అశోక్**
**ప్రక్రియ: కవిత్వం,కవితలు: 56**
**పుటలు: 116, వెల: 150**
**ప్రచురణ: మారసం ప్రచురణలు, రాజన్న సిరిసిల్ల**
**డి.టి.పి.: వి. హరీష్**
**ముద్రణ: తెలుగు విశ్వవిద్యాలయం, భాగ్యనగరం వారి ఆర్థిక సహాయంతో**
**అంకితం: జీవన సహచరి శ్రీలేఖకు**

**డా పెరుక రాజు**
**జాతీయ కవి ఢ విమర్శకుడు**
**7810032847**

# డోలి సంధ్య కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలి

**నిందితుడిని అరెస్టు చేసి కఠినమైన శిక్ష విధించాలి**

**బస్టాండ్ సెంటర్ వద్ద బైఠాయింపు, కలెక్టర్ వాహనం అడ్డగింపు**

**తమ కుటుంబానికి న్యాయం జరగడం లేదని**
**డోలి సంధ్య తమ్ముడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం**



అరుణప్రభ 31 ఆగస్ట్ మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణంలోని బస్టాండ్ సెంటర్ కేసముద్రం రోడ్డు వద్ద డోలి సంధ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడం జరిగింది అటువైపుగా వెళ్తున్న కలెక్టర్ వాహనాన్ని కుటుంబ సభ్యులు ఆపి మరీ వారి బాధను వ్యక్తం చేయడం జరిగింది. తీవ్ర బాధలో ఉన్న డోలి సంధ్య తమ్ముడు డోలి రాజేష్ నడిరోడ్డుపై వంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేయగా అక్కడ ఉన్న పోలీస్ అడ్డుకొని వారిని పిఎస్ కి తరలించడం జరిగింది.ఆ తర్వాత బస్టాండ్ సెంటర్ వద్ద బైఠాయించి సుమారు గంటపాటు ఆందోళన చేయడం జరిగింది, ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, పి డి ఎస్ యు, డి ఎస్ ఎఫ్ ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ డోలి సంధ్య మరణించి నేటికి 16 రోజులు కావస్తున్న నేటికీ నిందితున్ని అరెస్టు చేయకపోవడం పోలీసుల అలసత్వానికి నిదర్శనమని అన్నారు, నిందితుడు శ్యామ్ కి రాజకీయ అండదండలు ఉండడం వల్లనే పోలీసులు ఈ కేసును నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించి డోలి సంధ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వెంకన్న, స్వాతి, విద్యార్థి సంఘాల నాయకులు వెలుగు శ్రావణ్, బోనగిరి మధు, కే లోతు సాయికుమార్, సూర్య ప్రకాష్, సింహాద్రి, మేక వెంకటేష్, జలగం ప్రవీణ్, చిలువేరు వికాస్, గుడిబైన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు..

# భారత్ కో జానో - 2026 పరీక్షకు అనూహ్య స్పందన

**26 పాఠశాలలు -**
**సుమారు 5,400 మంది విద్యార్థుల భాగస్వామ్యం**







అరుణప్రభ 31 ఆగష్టు మహబూబాబాద్ : భారత్ వికాస్ పరిషత్ -- మానుకోట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక "భారత్ కో జానో -- 2026" పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 26 పాఠశాలలకు చెందిన సుమారు 5,400 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ పరీక్షలో పాల్గొన్నారు విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావన, భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, భౌగోళిక విశిష్టతలు, రాజ్యాంగం, విజ్ఞాన--సాంకేతిక రంగం, క్రీడలు, ప్రముఖ వ్యక్తులు మరియు దేశ విజయాలపై అవగాహన పెంపొందించడం "భారత్ కో జానో" కార్యక్రమ ప్రధాన లక్ష్యమని భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు తెలిపారు భారతదేశ గొప్పతనాన్ని, మన సంస్కృతి--సంప్రదాయాల విశిష్టతను విద్యార్థి దశ నుంచే తెలుసుకోవడం ద్వారా వారిలో దేశం పట్ల గౌరవం, బాధ్యత, సేవాభావం మరియు జాతీయ చైతన్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. కేవలం పరీక్షలో మార్కులు సాధించడమే కాకుండా, "మన భారతదేశాన్ని తెలుసుకుందాం - భారతీయులమని గర్విద్దాం" అనే స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు ఒకే రోజు 26 పాఠశాలల్లో సుమారు 5,400 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావడం మానుకోట శాఖకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పరీక్ష నిర్వహణకు సహకరించిన పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పరీక్ష నిర్వాహకులు, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు మరియు ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల్లో జాతీయ చైతన్యం, సేవాభావం, విలువలు మరియు విజ్ఞానాన్ని పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ -- మానుకోట శాఖ అధ్యక్షులు వొబిలిశెట్టి రామకృష్ణ, కార్యదర్శి జయప్రకాశ్ లోయ, కోశాధికారి గణేష్కృష్ణ, సీనియర్ సభ్యులు వి.వి. నాగేందర్, విశ్వనాథం, ఆవుల శ్రీనివాస్, భూపాల్ రెడ్డి,సంయుక్త కార్యదర్శి లెనిన్ బాబు, , విజయ్ తదితరులు పాల్గొని పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు "విద్యార్థుల్లో జ్ఞానం -- హృదయాల్లో దేశభక్తి" "మన దేశాన్ని తెలుసుకుందాం... భారతీయులమని గర్విద్దాం!" అని భారత్ వికాస్ పరిషత్ మానుకోట శాఖ తెలిపారు

# 'తెలుగు పలుకు - తరతరాల వెలుగు' కవితా పోటీలో డా పెరుక రాజు విజేత



హైదరాబాద్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వ సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన "తెలుగు పలుకు – – తరతరాల వెలుగు" కవితా పోటీకి విశేష స్పందన లభించింది. తెలుగు భాష పట్ల కవుల ప్రేమాభిమానాలకు, సాహితీ సృజనకు అద్దం పట్టిన ఈ పోటీలో దాదాపు 400 మంది కవులు ఉత్సాహంగా పాల్గొని తమ కవితా ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీలో తన సృజనాత్మక కవిత్వంతో విశిష్ట ప్రతిభ కనబరిచి విజేతగా ముందు వరుసలో నిలిచిన ప్రముఖ కవి డా పెరుక రాజుకు విశ్వ సాహితీ కళావేదిక తరఫున అభినందన పత్రాన్ని అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు భాష వైభవాన్ని, మాధుర్యాన్ని, భావితరాలకు అందించాల్సిన బాధ్యతను తన కవిత్వంలో ప్రతిబింబించిన డా. పెరుక రాజు సాహితీ కృషి అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయన అక్షర ప్రయాణం మరిన్ని విజయాలతో కొనసాగాలని, ఆయన కలం నుంచి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసే మరెన్నో సాహితీ సుమాలు విరబూయాలని ఆకాంక్షించారు. "మాతృభాష మన గర్వకారణం. మన ఆలోచనలకు ఆత్మ, మన సంస్కృతికి మూలం మాతృభాష. మన తెలుగు భాషను ప్రేమిద్దాం... గౌరవిద్దాం... భావితరాలకు అందిద్దాం. భాష ఉంటే భావం ఉంటుంది భావం ఉంటే భవిష్యత్తు ఉంటుంది. తెలుగు భాష కలకాలం జీవించాలి, తెలుగు తేజం ప్రపంచమంతా విరజిల్లాలి" అని విశ్వ సాహితీ కళావేదిక చైర్పర్సన్ పేర్కొన్నారు. తెలుగు కేవలం సంభాషణకు పరిమితమైన భాష కాదని, తరతరాల చరిత్రను, సంస్కృతిని, సాహితీ సంపదను తనలో దాచుకున్న మహాభాష అని వారు పేర్కొన్నారు. మాతృభాషను ప్రేమించడం, గౌరవించడం, పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. "అమ్మ పలుకులోని మమకారం... మట్టి పరిమళం మన తెలుగు. మన మూలాలను మోసే మాతృభాషను ప్రేమించడం, గౌరవించడం ప్రతి తెలుగువారి బాధ్యత" అని డా

పెరుక రాజు పేర్కొంటూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీమతి కొల్లి రమావతి, చైర్పర్సన్ జి. భవాని, మహిళా అధ్యక్షురాలు అంజలి కుమారి, తెలంగాణ విభాగం శ్రీకాంత్, జాతీయ కార్యదర్శి భారతి దేవి, రాష్ట్ర మహిళా కార్యదర్శితో పాటు విశ్వ సాహితీ కళావేదిక బృందం డా పెరుక రాజును అభినందించింది. "జై తెలుగు! జై భారత్!" అనే స్ఫూర్తితో తెలుగు భాష చిరంజీవిగా నిలవాలని, తెలుగు అక్షరాల వెలుగు ప్రపంచమంతా ప్రసరించాలని ఆకాంక్షించారు.




# చెత్త సేకరణకు రెండు కొత్త ఆటోలు

ధర్మవరం, ఆగస్టు 30; (అరుణ ప్రభ న్యూస్) పరిటాల రవీంద్ర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో చెత్త సేకరణకు రెండు కొత్త ఆటోలను సోమవారం అందజేయనున్నట్లు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నేసేపేటలోని పుట్లమ్మ గుడి వద్ద ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరై ఆటోలను సంబంధిత వార్డులకు అందజేయనున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
మంగళవారం, 1 సెప్టెంబరు, 2026

# గంగపుత్రుల ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు

### బోనాలతో ఆధ్యాత్మికత సంతరించుకున్న మానుకోట పురవీధులు

### ముగిసిన గంగమ్మ తల్లి ప్రతిష్ఠాపన ఉత్సవాలు





అరుణప్రభ 31 ఆగస్ట్ మహబూబాబాద్ అర్బన్ : మానుకోట జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గంగపుత్రుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గంగమ్మ గుడి నిర్మాణం పోతరాజుల విగ్రహాలు ఏర్పాటు జరగగా ఇటీవల శుక్రవారం రోజున గుడిలో గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించిన విషయం తెలిసిందే అమ్మవారిని జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖులు రాజకీయ నాయకులు ఉన్నతాధికారులు గంగపుత్రులు మరియు వారి బంధువులు ఆడపడుచులు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకోగా ఆదివారం బోనాల పండుగ ర్యాలీని గంగపుత్ర మహిళా మణులు పట్టణంలో నిర్వహించడం జరిగింది పట్టణంలోని గంగపుత్ర కుటుంబాల ఆడబిడ్డలు వారి కుటుంబ సభ్యులు బంధు మిత్రులందరికీ చీర సారే తో సత్కరించిన అనంతరం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుటుంబ సభ్యుల సమక్షంలో బోనాలతో బయలుదేరి మొక్కులు చెల్లించుకున్నారు ఈ బోనాలతో గంగపుత్ర భారీ ర్యాలీతో పట్టణంలో ఆధ్యాత్మికత వాతావరణం సంతరించుకుంది ఈ ర్యాలీలో శివసత్తులు పోతరాజులు విన్యాసాలు ఎందరినో ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం బాధ్యులు జిల్లా నాయకులు మైస నాగయ్య డాక్టర్ డోలి సత్యనారాయణ దేశపోయిన వెంకటస్వామి చుక్కల నరేష్ ఉపేందర్ దేశబోయిన అనిల్ డోలి వరదయ్య చుక్కల పరమేశు పిల్లి రాంప్రసాద్ చుక్కల నాగయ్య పిల్లి దశరథ్ కనకయ్య మద్దర్ల రాజన్న డోలి ఉమేష్ అవారి అనిల్ అవారి సునీల్ దేశ బోయిన విజయ్ మైస శ్రీనివాస్ దేశబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల కడితే కఠిన చర్యలు తప్పవు

### కూల్చివేతకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దాడి

### ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేస్తే సహించేది లేదన్న తహసీల్దార్





ఆగస్టు 31, అరుణ ప్రభ : ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. మేడిపల్లి మండలం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో సర్వే నంబర్లు 28 నుంచి 39 వరకు ఉన్న ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా కూల్చివేతలను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు తెలిసింది. కూల్చివేత చర్యలకు వెళ్లిన రెవెన్యూ అధికారిపై భౌతిక దాడి జరిగినట్లు సమాచారం.

**ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు**

ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని మేడిపల్లి తహసీల్దార్ వెంకట నర్సింహ్మా రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను కాపాడటమే రెవెన్యూ శాఖ బాధ్యత అని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారిపై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. రెవెన్యూ అధికారులపై దాడికి పాల్పడిన ఘటనపై కూడా అధికారులు తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## మన విలువకు మనమే కర్త కర్మ క్రియ

ఎవడో విలువ ఇవ్వలేదని
బాధపడద్దు మనకు విలువ
ఇవ్వమని అడిగే ముందు
మనమే విలువ పెంచుకోవాలి

మన విలువలకు మనమే
కర్త కర్మ క్రియ మనం విలువలు
పాటిస్తే అదే విలువలు మనకు
గుర్తింపు తెస్తాయి

మన నైపుణ్యాలు మన వ్యక్తిత్వం
మన ఆలోచన విధానం మన
నడవడి మన చర్యల కలబోతే
మన విలువ

ఇతరుల పట్ల గౌరవం ఆదరణ
మన ఉనికిని చాటుతాయి

మన ముందు మంచి అని
పొగిడే వారు మన వెనుక
కూడా మన పట్ల మంచినే
చెప్పాలి మంచిని పెంచి
మంచిని పంచే మానవతా
వాదులుగా నిలువాలి

సక్రమ జీవనశైలిపరోపకారం
సహనశీలత ఆలోచనలకు
ఆచరణకు మధ్య సమతూక
మనస్తత్వంవిశ్వసనీయతకు
ఆలంభణ అవుతుంది

సకారత్మక కార్యాచరణతో
జీవిస్తే సమాజంలో
మీవ్యక్తిత్వానికి విలువ
ఉంటుందిసమాజంలో
గౌరవం లభిస్తుంది

కష్టాలను ఇష్టాలుగా మార్చుకొని
ముందడుగు వేస్తే సమాజానికి
స్ఫూర్తి వైతావు పట్టుదలే
పెట్టుబడిగా సంకల్పిస్తే
ప్రగతి వెలుగులకుదీప్తి వైతావు



**నేదునూరి కనకయ్య**
ఫ్రీలాన్స్ రచయిత
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్
9440245771

# మున్సిపల్ స్కూల్ ఆయాల వేతనాలు పెంచాలి



ధర్మవరం, ఆగస్టు 31; (అరుణ ప్రభ న్యూస్) : మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల పని భారం తగ్గించి, వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఆర్డీవో రామ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్, నాయకులు ఎల్. ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జె.వి. రమణ మాట్లాడుతూ.. 25 నుంచి 30 ఏళ్లుగా పనిచేస్తున్న ఆయాలకు నెలకు కేవలం రూ.4 వేల వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. అదికూడా నాలుగు, ఐదు నెలలకోసారి చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు రెండు గంటల పని చేయాల్సి ఉండగా 8 నుంచి 10 గంటలు పనిచేయిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి పని భారం తగ్గించి, వేతనాలు పెంచడంతో పాటు ప్రతినెలా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆయాల సంఘం ప్రధాన కార్యదర్శి జయమ్మ, ముంతాజ్, గంగమ్మ, ప్రమీల, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్దం పూర్తి చేసుకున్న టెన్నిస్ కోర్టు



ధర్మవరం, ఆగస్టు 31; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో టెన్నిస్ క్రీడకు వందేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ జగన్నాథ రాజు టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారులు మాట్లాడుతూ.. కళాజ్యోతిలో వేలాది మంది క్రీడాకారులు టెన్నిస్‌లో శిక్షణ పొంది ప్రతిభ చాటారని, పలువురు క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. డీఎస్పీ జగన్నాథ రాజు మాట్లాడుతూ.. టెన్నిస్‌కు ధర్మవరంలో వందేళ్ల చరిత్ర ఉండటం గర్వకారణమన్నారు. శతాబ్ది వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రభాకర్, టూటౌన్ సీఐ జయనాయక్, సీనియర్ క్రీడాకారులు బండి రాము, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# 18 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



ధర్మవరం, ఆగస్టు 31; (అరుణ ప్రభ న్యూస్) ధర్మవరం పట్టణంలోని శివానగర్ మున్సిపల్ పాఠశాలలో 2008--09 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత తమ ఉపాధ్యాయులను కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. అప్పట్లో విద్యార్థులను తమ పిల్లలుగా భావించి, ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో విద్యాబోధన చేశామని తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమకు విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, మర్యాద నేర్పిన ఉపాధ్యాయులే తమ ఎదుగుదలకు కారణమని పేర్కొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ పాత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, వారితో కలిసి ఫొటోలు దిగుతూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.



## అనాధ మహిళకు అంత్యక్రియలు

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని ఓం శ్రీ సాయిరాం వృద్ధాశ్రమంలో ఆశ్రమం పొందుతున్న మేరమ్మ (70) ఒంటరి వృద్ధ మహిళ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని ఆశ్రమ నిర్వాహకులు మెగా బ్రదర్స్ సేవా సమితి దృష్టికి తీసుకువెళ్ళారు. దీనితో మెగా బ్రదర్స్ సేవా సమితి అంత్యక్రియలను నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మెగా బ్రదర్స్ సేవా సమితి ప్రతినిధులు తీగల చంద్ర శేఖర్ , మోహన్, ఓంకార్ , శ్రీను , అవినాష్ , నవీన్ , తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల పంపిణీలో నేటినుండి నుంచి కొత్త విధానం

### వివరాలు వెల్లడించిన మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి



అరుణప్రభ 31 ఆగస్ట్ మహబూబాబాద్ అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ యాప్ (ఎఫ్ ఎఫ్ ఎస్) ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ జరుగుతుందని కావున ప్రతి రైతు యాప్ ఆండ్రాయిడ్ ఫోన్ లో ప్లే స్టోర్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి రైతులకు తెలిపారు. యాప్ లో ఏవైనా ఇబ్బందులు ఎదురైన వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సలహాలు తీసుకోవాలని తెలిపారు. యూరియా తో పాటు డీఏపి,కాంప్లెక్స్ ఎరువులు ,పొటాష్ , సూపర్ ఫాస్ఫేట్ అన్ని ఎరువులు యాప్ ద్వారా మాత్రమే లభిస్తుందని తెలిపారు



## టీచర్స్ లీగ్ ప్రారంభం

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో 'ప్రగతి సేవా సంస్థ' ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యాబోధనలో ఒత్తిడికి గురయ్యే ఉపాధ్యాయులకు క్రీడలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయని, శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని తెలిపారు. ప్రతి ఏటా ఈ పోటీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ప్రగతి సేవా సంస్థ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ , సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## కేజీబీవీ సమస్యలపై హరీష్‌బాబు క్షేత్రస్థాయి పరిశీలన

ముదిగుబ్బ, ఆగస్టు 31; (అరుణ ప్రభ న్యూస్) : ముదిగుబ్బ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు కేజీబీవీని సందర్శించిన ఆయన విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా నీటి కొరత, ఫ్యాన్లు పనిచేయకపోవడం వంటి సమస్యలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన హరీష్ బాబు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వసతి గృహం పరిసరాలను పరిశీలించగా చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, మురుగునీరు వంటి పారిశుద్ధ్య లోపాలు కనిపించాయి. దీంతో ఎంపీడీవో, పంచాయతీ అధికారులతో సమన్వయం చేసి వెంటనే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టించారు. చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. బాలికల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని హరీష్ బాబు అధికారులకు సూచించారు. కేజీబీవీ విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని, సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాలపాటి రామకృష్ణ, ఇందుకూరు ఓబిరెడ్డి, తిరుపాల్ నాయక్, ప్రసాద్, నాగేంద్ర, గంగులప్ప, శివ తదితరులు పాల్గొన్నారు.



## ప్రధానోపాధ్యాయులు ఎం.డి వహీద్ ఉద్యోగ విరమణ అభినందన సన్మాన మహోత్సవము

అరుణప్రభ 31 ఆగస్ట్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కురవి ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం డి వహీద్ పదవి విరమణ కార్యక్రమము ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ముత్యాల శ్రీధర్ ధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ యశోద కురవి మండల విద్యాశాఖ అధికారి బాలాజీ సీరోల్ మండల విద్యాశాఖ అధికారి లచ్చిరాం చింతపల్లి ప్రధానోపాధ్యాయులు శంకర్ గారు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, మండల ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు విజయ్ కుమార్,సీతారాములు, మంజుల, శివ, గిరిజ, స్వప్న, సత్యనారాయణ చారి, ఉషశ్రీ, తిరువెంకటాచార్యులు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు మొదలగు వారు పాల్గొన్నారు

# అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అరుణప్రభ మహబూబాబాద్, ఆగస్ట్.31 : సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై ఉమ్మడి వరంగల్‌జిల్లా సమావేశాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపి లు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్,ఉమ్మడి జిల్లాలకు సంబందించిన శాసనసభ్యులతో కలిసి సమీక్షించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మంచి పనితీరు కనబరిచే అధికారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అక్రమాలకు పాల్పడే లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం వెనుకాడదని హెచ్చరించారు 22ఏ నిషేధిత జాబితా, భూ సమస్యలు తదితర అంశాలపై అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సొంత నిర్ణయాలు తీసుకోవద్దని మంత్రి గారు సూచించారు.







నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదన్నారు అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి నెల కనీసం ఒకటి లేదా రెండుసార్లు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంస్కరణ ప్రజలకు చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. తెలంగాణ లోని ప్రతి మారు మూల ప్రాంతానికి సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నాం. ఇందిరమ్మ ఇండ్లు ఉన్న గ్రామాలు, వార్డుల్లోనే ఓట్లు అడుగుతాం ఇందిరమ్మ పరిపాలన కాలంలో రాష్ట్రం లో 25 లక్షల ఎకరాల భూములను పేదవారికి పంపిణీ చేసామన్నారు

అంతకుముందు కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ తెలంగాణ లోని ప్రతి మారు మూల ప్రాంతానికి సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఇందిరమ్మ ఇండ్లు ఉన్న గ్రామాలు , వార్డుల్లోనే ఓట్లు అడుగుతామన్నారు

సోమవారం 780 మంది రైతులకు భూ ఆధార్ పట్టా పాస్ పుస్తకాలను పంపిణీ చేశామని నాలుగు రోజుల క్రితం తుంగతుర్తి లో 13 గ్రామాలకు చెందిన రైతులకు 3400 ఎకరాలకు పట్టాలను అందించాం భూభారతి తోనే ఇది సాధ్యమైందని రాష్ట్రంలో 125 సంవత్సరాల క్రితం చేసిన సర్వే మళ్లీ ఇప్పుడు చేస్తున్నామని ఈ సర్వే తో శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం చేసి రాష్ట్రం లో కోటి మందిని కోటీశ్వరులు చేస్తామని అన్నారు.ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంటుందని అన్నారు.

కేసముద్రం మండల కేంద్రంలో 1 కోటి 90 లక్షల వ్యయంతో నిర్మించిన 33/ 11, కె.వి. విద్యుత్ ఉప కేంద్రంను ప్రారంభించి ప్రాంగణంలో మొక్క నాటారు,మున్సిపల్ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయలు ఇనుగుర్తి, దంతాలపల్లి, సిరోలు, నూతన భవనం నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్య సభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపి పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే లు డాక్టర్ భూక్య మురళి నాయక్, కె.ఆర్ నాగరాజు , గండ్ర సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బానోతు సునీత, తదితరులు ఉన్నారు




## ఆరోగ్యమే మహాభాగ్యం

**(జాతీయ పోషకాహార వారోత్సవాల సందర్భంగా ( సెప్టెంబర్1 - 7వతేదీ వరకు) రాసిన కవిత )**

ప్రకృతి ప్రసాదించిన
పచ్చని కూరగాయలు
ఆరోగ్యానికి
అసలైన సిరులు

రంగురంగుల తాజా
పండ్లుమనకు అందిస్తాయి
రోగనిరోధక శక్తులను

తృణధాన్యాలు పప్పుల
మేళవింపు బలమైన శరీరానికి
ఆయువు పట్టు ఇమ్యూనిటీతో
రోగాలపై గెలుపుకు సారధి

కాయగూరలు కమ్మని
పోషకాల సిరి
వీటిని తింటే అనారోగ్యాలు
దూరమౌతాయి

జంక్ ఫుడ్ కాసేపు పక్కన
పెడదాం సమతుల్య
ఆహారానికి జై కొడుదాం

చిరుధాన్యాల ప్రాముఖ్యతను
తెలుసుకుందాం చిరుధాన్యాల
వంటకాల ఆవశ్యకతపై
సమాజాన్ని చైతన్య పరుద్దాం

పోషకాల విలువను
ఇంటింటికీ చాటుదాం
ఆరోగ్యకరమైన
భారతాన్ని నిర్మిద్దాం,
పోషకాహార
వారోత్సవాలను
విజయవంతం చేద్దాం

ఆరోగ్యకరమైన ఆహారమే
ఆనందకరమైన జీవితానికి
తొలి అడుగు

మంచి హారం కోసం పెట్టే ఖర్చు
రేపటి హాస్పటల్ ఖర్చులను
దూరం చేసే పెట్టుబడి రుచి
కోసం కాక శక్తి కోసం తిందాం
పోషకాహారంతో
నవభారతం నిర్మిద్దాం



**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
రచయిత కాలమిస్ట్
కరీంనగర్
9440245771



## ప్రజా వినతులపై సత్వర చర్యలు తీసుకోవాలి

ధర్మవరం, ఆగస్టు 31; (అరుణ ప్రభ న్యూస్) : ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యమని ఆర్డీవో రామ భూపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి 8 దరఖాస్తులు స్వీకరించారు. వాటిలో రెవెన్యూ శాఖకు 4, సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖకు 2, ఇతర శాఖలకు 2 దరఖాస్తులు అందాయి. మండలాల వారీగా ధర్మవరం నుంచి 3, బత్తలపల్లి నుంచి 2, ముదిగుబ్బ నుంచి 2, చెన్నేకొత్తపల్లి నుంచి ఒక దరఖాస్తు వచ్చాయి. కనగానపల్లి, రామగిరి, తాడిమర్రి మండలాల నుంచి ఎలాంటి దరఖాస్తులు రాలేదు. అందిన వినతులను సంబంధిత అధికారులు సత్వరమే పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆర్డీవో సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు.

## సెప్టెంబర్ నెలంతా జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలు

**అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సభలు నిర్వహించొద్దు**

**నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలి.**

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



ఎల్లారెడ్డి పేట (అరుణప్రభ న్యూస్): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పోలీస్ యాక్ట్--1861 ప్రకారం సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించవద్దని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడరాదని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు చట్టాలను, పోలీస్ యాక్ట్ నిబంధనలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజల సహకారంతోనే ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించగలమని ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## పదిర గ్రామంలో కమ్యూనిటీ ప్రోగ్రాం

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై ఎన్. రమేష్**

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 (అరుణప్రభ న్యూస్): ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో సోమవారం కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ పాల్గొని గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. గ్రామాల్లో గంజాయి నిర్మూలనకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై రమేష్ పిలుపునిచ్చారు. గంజాయి వినియోగం, విక్రయం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల భద్రత, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై రమేష్ కోరారు.




## అక్కపల్లి గ్రామంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31: ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపల్లి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదాసు శ్రావంతి బాబు, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, వార్డు సభ్యులు వర్కుటి రాజు, మందాటి ఆంజనేయులు, పిట్టల లక్ష్మీ మోహన్, ముక్క లింగవ ఎల్లయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు జంగా భూమిరెడ్డి, రేషన్ డీలర్ పునుగంటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు. కొత్త రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజాప్రతినిధులు సూచించారు.

## ఆదూరి ఉదయ భాస్కర్ కి థియోలాజికల్ యూనివర్సిటీ, డల్లాస్ ద్వారా గౌరవ డాక్టరేట్ ప్రదానం

**ఆధ్యాత్మిక రంగంలో ఆదూరి ఉదయ భాస్కర్ సేవలకు విదేశాల్లో గుర్తింపు**





ఆగస్టు 31, అరుణ ప్రభ : ఆదూరి వారి ఆధ్యాత్మిక జీవితం లో సూక్ష్మ మండలం లోని హిమాలయ మాస్టర్స్ గురు పరంపర ఆదేశానుసారం వారి సందేశాలను లోక కళ్యాణార్థం ఇప్పటివరకు 37 ఆధ్యాత్మిక గ్రంథాలుగా మానవాళికి అందించారు. అష్టైశ్వర్యాలు సమకూర్చే మహాలక్ష్మి సాధనలు, అమావాస్య సాధనలు, సామూహికంగా సంపూర్ణ యజ్ఞ పూర్వకంగా జరిపించారు. ఆదూరి వారు స్వయంగా కోటి మహాలక్ష్మి మంత్ర జపం మరియు జప పూర్ణాహుతి యజ్ఞం చేసారు. పరాశక్తి – క్రియాయోగ మంత్ర దీక్షలు, సమర్థ సద్గురు స్పర్శ ధ్యాన దీక్షలు వేలమందికి అందించారు. భాష్యం విద్యా సంస్థల్లో పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆధ్యాత్మిక, యోగ, ధ్యాన విద్యలను అందించారు. గాయత్రి పరివార్ మారెళ్ల రామకృష్ణ గురు దేవుల అనుగ్రహం తో అఖండ గురు సత్తాలో భాగంగా భగవాన్ రమణులు, అరబిందో సావిత్రి, పండిత శ్రీరామ శర్మ ఆచార్య, మాస్టర్ సి వి వి, మేడం బ్లావెస్టుకి, యోగానంద, లాహిరి, మహా అవతార్ బాబా ఆశీస్సులతో సమాజ శ్రేయస్సు కోసం తన జీవితాన్ని ఆధ్యాత్మిక రంగానికి అంకితం చేశారు. ప్రస్తుతం గౌరవ డాక్టరేట్ అందుకున్న తరుణంలో డాక్టర్ ఆదూరి ఉదయ భాస్కర్ గా మరింత బాధ్యత పెరిగింది కాబట్టి నాపూర్తి జీవితాన్ని సనాతన ఆధ్యాత్మిక సేవకు అంకితం చేశాను అన్నారు.





## గుండారం గ్రామంలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

**అంటరానితనాన్ని నిర్మూలించి సామాజిక సమానత్వాన్ని సాధించాలి**

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 (అరుణప్రభ న్యూస్): ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామ పంచాయతీలో ఎస్సీ, ఎస్టీ అంటరానితనం నిర్మూలన మరియు పౌర హక్కుల ది నోత్సవాన్ని సర్పంచ్ సరోజ చంద్రు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూ లించి, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం, సామాజిక సమానత్వం కల్పించేందుకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కుల వివక్షకు తావులేకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ సమానంగా జీవించేలా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జెట్టి కిషన్, పాలకవర్గ సభ్యులు బానోతు గణేష్, పద్మ, అమల, సంపూర్ణ, జీపీఓ యాస్మిన్, ఏఎస్ఐ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి మహేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుడిదీ రాజేందర్, అంగన్వాడీ టీచర్లు సుభద్ర, కళ్యాణి, ఆశా వర్కర్ సుజాతతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# బిల్లింగ్ కౌంటర్లకు మంగళం
# డిజిటల్ బాటలో విద్యుత్‌శాఖ!

## రేపటి 'ప్రీపెయిడ్'కు నేటి నుంచే ప్రజలను సిద్ధం చేస్తున్నారా?

## ఏపీలో 56.08 లక్షల స్మార్ట్ మీటర్లకు ఆమోదం.. ?

## ఇప్పటికే 22.88 లక్షల మీటర్ల ఏర్పాటు

## APSPDCLలో బిల్ కౌంటర్ల దశలవారీ తొలగింపునకు నిర్ణయం.. 100 శాతం డిజిటల్ చెల్లింపులే లక్ష్యం

**ధర్మవరం, ఆగస్టు 31; (అరుణ ప్రభ న్యూస్)**

విద్యుత్ బిల్లుల చెల్లింపు విధానంలో ఆంధ్రప్రదేశ్ మరో కీలక మార్పు దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు విద్యుత్ కార్యాలయాలకు వెళ్లి నగదు రూపంలో బిల్లులు చెల్లించే వినియోగదారుల స్థానంలో.. ఇక పూర్తిగా డిజిటల్ చెల్లింపుల వైపు ప్రజలను మళ్లించే ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. ఞాఞాణజా పరిధిలో బిల్ కౌంటర్లను దశలవారీగా తగ్గించి 100 శాతం డిజిటల్ చెల్లింపుల లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జూలై 10న వెలువడిన నివేదిక పేర్కొంది. అయితే ఈ మార్పు వెనుక అసలు లక్ష్యం ఏమిటన్నదే ఇప్పుడు వినియోగదారుల్లో చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో స్మార్ట్, ప్రీపెయిడ్ మీటర్ల విస్తరణకు డిజిటల్ చెల్లింపు వ్యవస్థను ముందుగానే అలవాటు చేస్తున్నారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### 56 లక్షలకు పైగా స్మార్ట్ మీటర్లకు గ్రీన్ సిగ్నల్

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో RDSS కింద 56,08,846 వినియోగదారుల స్మార్ట్ మీటర్లు మంజూరయ్యాయి. 2026 జనవరి నాటికి వాటిలో 22,88,414 మీటర్లు అమర్చినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనికి అదనంగా పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లకు సంబంధించిన వేలాది మీటర్లను కూడా మంజూరు చేశారు. అంటే స్మార్ట్ మీటర్ల వ్యవస్థ ఏపీలో కేవలం ప్రతిపాదన దశలో కాకుండా.. ఇప్పటికే భారీ స్థాయిలో అమలు దిశగా వెళ్లిన విషయం అధికారిక గణాంకాలతో స్పష్టమవుతోంది.

### ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే 'ప్రీపెయిడ్' ప్రయోగం

ఇక మరింత ఆసక్తికరమైన విషయం.. APSPDCL పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, మున్సిపల్ సంస్థలు, ప్రజా నీటి సరఫరా వ్యవస్థలు, వీధి దీపాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్ విధానం జూన్ 1, 2026 నుంచి అమల్లోకి తీసుకొచ్చినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ విధానంలో ప్రభుత్వ విభాగాలు ముందుగానే డిజిటల్ బ్యాలెన్స్‌లో నగదు జమ చేయాలి. విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఆ మొత్తంలో నుంచి రోజువారీగా చార్జీలు తగ్గుతాయి. బ్యాలెన్స్ తగ్గినప్పుడు హెచ్చరికలు వస్తాయి. బ్యాలెన్స్ పూర్తిగా అయిపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోయే విధానం అమల్లోకి వస్తుంది. ఈ ప్రయోగం శ్రీసత్యసాయి జిల్లాతో పాటు ఞాఞాణజా పరిధిలోని పలు జిల్లాల్లో అమలవుతోంది. శ్రీ సత్యసాయి జిల్లాకు ఈ కార్యక్రమంలో రూ.88.81 లక్షల కేటాయింపు ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి.

### డిజిటల్ బిల్లులు.. రేపటి ప్రీపెయిడ్‌కు పునాది?

**ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.**

ఒకవైపు బిల్ కౌంటర్లను తగ్గించి డిజిటల్ చెల్లింపులను 100 శాతానికి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది. మరోవైపు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్ విధానం ప్రభుత్వ సంస్థల్లో ఇప్పటికే అమల్లోకి వచ్చింది. అదే సమయంలో రాష్ట్రంలో లక్షలాది స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు, నిధులు అందుతున్నాయి. ఈ పరిణామాలన్నింటినీ కలిపి చూస్తే.. భవిష్యత్తులో ప్రీపెయిడ్ విద్యుత్ విధానం విస్తరించినా, వినియోగదారులు ముందుగానే డిజిటల్ చెల్లింపులకు అలవాటు పడేలా ప్రస్తుత వ్యవస్థను మార్చుతున్నారా? అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**అయితే "బిల్ కౌంటర్ల తొలగింపు కేవలం ప్రీపెయిడ్ మీటర్ల కోసమే" అని ఞాఞాణజా అధికారికంగా ప్రకటించినట్లు ఆధారం ఇప్పటివరకు బయటపడలేదు. అందువల్ల దీనిపై అధికారిక స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉంది.**

### ధర్మవరం వినియోగదారుల ప్రశ్న ఇదే!

ధర్మవరం వంటి పట్టణాల్లో ఇప్పటికీ డిజిటల్ చెల్లింపులు చేయలేని లేదా వాటిపై అవగాహన లేని వృద్ధులు, పేదలు, గ్రామీణ ప్రాంతాల వినియోగదారులు ఉన్నారు.

**కౌంటర్లను పూర్తిగా తగ్గిస్తే..**

- డిజిటల్ చెల్లింపులు చేయలేని వినియోగదారుల పరిస్థితి ఏమిటి?
- వృద్ధులు, నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్ లేని వారికి ప్రత్యామ్నాయం ఏమిటి?
- విద్యుత్ బిల్లును నగదుగా చెల్లించే హక్కు పూర్తిగా తొలగిస్తున్నారా?
- కౌంటర్లు మూసివేయడానికి APSPD-CL జారీ చేసిన అధికారిక ఉత్తర్వు/సర్క్యులర్ ఏమిటి?
- భవిష్యత్తులో గృహ వినియోగదారులకు కూడా ప్రీపెయిడ్ మీటర్లు బిగించే ప్రణాళిక ఉందా?
- ఉంటే ఏ దశలో, ఏ వర్గం వినియోగదారుల నుంచి ప్రారంభిస్తారు?

**అన్న ప్రశ్నలకు విద్యుత్ శాఖ సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.**




### ప్రజల ముందున్న అసలు ప్రశ్న

**"కరెంట్ బిల్లు చెల్లించే పద్ధతి మాత్రమే మారుతోందా?.. లేక రేపటి ప్రీపెయిడ్ విద్యుత్ వ్యవస్థకు ప్రజలను ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారా?"**

విద్యుత్ శాఖ దీనిపై పూర్తి వివరాలను బహిర్గతం చేస్తే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడనుంది.

# శివపరాశక్తి పీఠంలో వైభవంగా విశేష పూజలు

## సప్త హారతులతో కన్నులపండువగా ఆధ్యాత్మిక వేడుకలు



ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 (అరుణప్రభ న్యూస్): పవిత్ర సోమవారం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని శ్రీ శివపరాశక్తి పీఠంలో స్వామివారు, అమ్మవార్లకు విశేష పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పీఠంలో జరిగిన పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ శివపరాశక్తి పీఠాధిపతి మనోహర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతం, గంధం, భస్మంతో మహాభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామివారికి సప్త హారతులు (ఏడు హారతులు) సమర్పించారు. సప్త హారతుల కార్యక్రమం భక్తులకు నయనానందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారు, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల్లో భక్తిభావాన్ని మరింత పెంపొందించాయి. పూజా కార్యక్రమాల అనంతరం పీఠానికి విచ్చేసిన భక్తజనులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారు, అమ్మవార్ల ఆశీస్సులు పొందారు





# భూసేకరణ పనులు వేగంగా పూర్తిచేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.**

**రైల్వే లైన్ల నిర్మాణం, విస్తరణ పనులపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్.**

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : రాష్ట్రంలో చేపడుతున్న రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్తో కలిసి రాష్ట్రంలోని రైల్వే లైన్ల నిర్మాణం, విస్తరణ, డబ్లింగ్ పనులు, భూసేకరణ, పనుల పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రధాన రైల్వే లైన్ల నిర్మాణం, విస్తరణ పనుల పురోగతిని అధికారులు సీఎస్‌కు వివరించారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించడంలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని సీఎస్ సూచించారు. అలాగే రైల్వే లైన్ల డబ్లింగ్ పనులు, కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, స్టేషన్ల ఆధునీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఆయా ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు



పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత జిల్లా అధికారులు, రైల్వే శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పరిశుభ్రతకు శ్రీరామ్ చేయూత

ధర్మవరం, ఆగస్టు 31; (అరుణ ప్రభ న్యూస్) : పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ధర్మవరం మున్సిపాలిటీకి రెండు చెత్త తరలింపు విద్యుత్ వాహనాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అందజేశారు. పట్టణంలోని నేసేపేట పుట్లమ్మ ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్యకు వాహనాలను అందించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర సేవలను చిరస్థాయిగా నిలిపేలా ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. సిల్క్ సిటీగా పేరున్న ధర్మవరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి నుంచి ప్రారంభం కావాలని సూచించారు. ట్రస్టు సేవా కార్యక్రమాలకు ధర్మవరం ప్రజలు, వ్యాపారులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. పరిటాల రవీంద్రతో సన్నిహితంగా ఉన్న ధర్మవరం ప్రజల సలహాలు, సూచనలతో మరింత సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పట్టుచీరల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 3లోపు పింఛన్లు పంపిణీ

ధర్మవరం, ఆగస్టు 31; (అరుణ ప్రభ న్యూస్) : మండల పరిధిలోని పింఛన్‌దారులు తమ పింఛన్లను సకాలంలో తీసుకోవాలని ఎంపీడీవో వెంకటేష్ సూచించారు. సోమవారం నుంచి గ్రామపంచాయతీల పరిధిలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుందని తెలిపారు. మండలంలో 6,660 మంది పింఛన్‌దారులకు రూ.2.96 కోట్ల పింఛన్ నగదును పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 3లోపు అందరికీ పింఛన్లు అందజేస్తామని తెలిపారు. పింఛన్ పొందేందుకు ఎవరూ సిబ్బందికి లంచం ఇవ్వవద్దని ఎంపీడీవో స్పష్టం చేశారు.



# నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

ధర్మవరం, ఆగస్టు 31; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం నాగులబావి వీధికి చెందిన షేక్ కరురప్ప (80) సోమవారం మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకు వచ్చారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదానానికి అంగీకరింపజేశారు. ప్రముఖ కంటి వైద్యుడు నరసింహులు సహకారంతో అనంతపురం నుంచి వచ్చిన కంటి వైద్యుడు ఈశ్వరరావు కరురప్ప నేత్రాలను సేకరించారు. వైద్యులు వచ్చే వరకు నేత్రాలు భద్రంగా ఉండేందుకు మానవతా సంస్థ ఉచితంగా ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేయడంతో పాటు రవాణా ఖర్చులను భరించింది. అనంతరం మానవతా సభ్యులు కరురప్ప పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షుడు శంకర నాయుడు, డైరెక్టర్లు నరసింహారెడ్డి, జింకా చిన్నప్ప, జిల్లా అంధత్వ నివారణ అధికారి, ప్రముఖ కంటి వైద్యుడు నరసింహులు, కంటి వైద్య నిపుణుడు ఊరుకుందప్ప తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్-బండలింగంపల్లి రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలి



ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 -- అరుణ ప్రభ న్యూస్: నారాయణపూర్ నుంచి బండలింగంపల్లి వరకు ఉన్న ప్రధాన రహదారికి వెంటనే మర మ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, వాహనదారులు అధికారులను కోరారు. ఎల్లారెడ్డిపేట మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమ ంలో నారాయణ పూర్, బండలింగంపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమ స్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరా లుగా రహదారి అధ్వానంగా మారడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని వారు తెలిపారు. రహదారిపై గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రమాదకరంగా మారిందని, వాహనదారులు, రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రహదారి పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని నారాయణపూర్--బండలింగంపల్లి రహదారి మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# సెప్టెంబర్ 9న చలో వరంగల్‌ను విజయవంతం చేయాలి



ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 31 (అరుణప్రభ న్యూస్): సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నూతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలపై భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వరంగల్ సభకు హాజరయ్యే ప్రతి మాదిగ బిడ్డ నల్ల ప్యాంట్, తెల్ల షర్ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మునిగే ఎల్లం మాదిగ, ఎంఎస్పీ అధ్యక్షులు అందే సామ్యూల్ మాదిగ, నాయకులు బక్కి నరసయ్య, మరాఠీ మైసయ్య, గొట్టిముక్కల భాస్కర్, మునిగే నరసింహులు, తాటిపల్లి నరసయ్య, ప్రవీణ్, మునిగే దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
మంగళవారం, 1 సెప్టెంబరు, 2026





# ముసారాంబాగ్ హై-లెవల్ బ్రిడ్జి ప్రారంభం



హైదరాబాద్ నగర ప్రజల చిరకాల అవసరమైన మరో కీలక మౌలిక వసతి ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. మూసీ నదిపై అంబర్‌పేట -- దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో రూ.52 కోట్ల వ్యయంతో, 400 మీటర్ల పొడవుతో నిర్మించిన ముసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జిని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు నూతన బ్రిడ్జిని పరిశీలించడంతో పాటు, బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారా పరిశీలించారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో అంబర్‌పేట, ముసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ట్రాఫిక్ రద్దీ కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. నగరంలో రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచడంలో ఈ బ్రిడ్జి కీలకంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వీ. హనుమంతరావు గారు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, అసదుద్దీన్ ఓవైసీ గారు, శాసనసభ్యులు కాలేరు వెంకటేష్ గారు, మల్‌రెడ్డి రంగారెడ్డి గారు, శ్రీగణేష్ గారు, నవీన్ యాదవ్ గారు, టీజీఆర్టీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి గారు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.






## హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ‘గ్లోబల్ నాలెడ్జ్ హబ్’గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ‘తెలంగాణ రైజింగ్’ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఇటీవల బ్రిటన్, అమెరికా దేశాల్లో చేపట్టిన సుదీర్ఘ పర్యటన విజయవంతమైంది. ఈ విదేశీ పర్యటనలో సాధించిన చారిత్రాత్మక పురోగతి, ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కుదిరిన కీలక ఒప్పందాలు, అవగాహనా ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ల సమగ్ర వివరాలతో కూడిన ప్రత్యేక నివేదికను ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేసింది. ఐటీ, పరిశ్రమలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, డిఫెన్స్ రంగాల్లో ఇప్పటికే ప్రపంచ పటంలో ప్రత్యేక ముద్ర వేసిన హైదరాబాద్ నగరాన్ని, ఇప్పుడు అంతర్జాతీయ విద్యా, నైపుణ్య రంగానికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. కమిటీ నివేదిక ప్రకారం అమెరికాలోని అత్యుత్తమ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ భారత్‌లోనే తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు స్పష్టమైన అంగీకారం తెలిపాయి. ముఖ్యంగా నార్త్ ఈస్టర్న్ వర్సిటీ తమ క్యాంపస్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసే అవకాశాలను ముమ్మరంగా పరిశీలిస్తోంది. దీనికితోడు ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచే హార్వర్డ్ యూనివర్సిటీ హైదరాబాద్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వేదికగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ రంగ ప్రతినిధుల కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను నిర్వహించేందుకు పచ్చజెండా ఊపింది. ఈ అంతర్జాతీయ కోర్సులు రాబోయే నవంబర్ నెల నుంచే నగరంలో ప్రత్యక్షంగా ప్రారంభం కానున్నాయి. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, లండన్ బిజినెస్ స్కూల్, వర్జీనియా టెక్, ఇంపీరియల్ కాలేజ్ లండన్ వంటి దిగ్గజ విద్యాసంస్థల అధిపతులతో విస్తృత స్థాయి చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సంస్థల నిపుణుల బృందాలు త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించి ప్రత్యక్షంగా ఇక్కడి వసతులను పరిశీలించనున్నాయి. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, అలాగే ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని నివేదిక స్పష్టం చేసింది. కమిటీ నివేదికను స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యానికి ఈ విదేశీ పర్యటన, అంతర్జాతీయ వర్సిటీల భాగస్వామ్యం ఊపిరి పోసిందని హర్షం వ్యక్తం చేశారు. మన రాష్ట్ర విద్యార్థులకు, యువతకు హైదరాబాద్‌లోనే ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యాలు అందేలా రూపుదిద్దుకుంటున్న ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు తానే స్వయంగా నాయకత్వం వహిస్తానని సీఎం ప్రకటిస్తూ, అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో అంతర్జాతీయ విద్యా కేంద్రం, గ్లోబల్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటైతే మరిన్ని ప్రపంచ స్థాయి మల్టీనేషనల్ కంపెనీలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు తెలంగాణకు తరలివస్తాయని వెల్లడించారు. దీనివల్ల మన యువతకు విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు తయారీ, పరిశోధన రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని తెలిపారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ ఛైర్‌పర్సన్ శాంతకుమారి, సీఎం సలహాదారు కె. రామకృష్ణరావు ఈ నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతం చేశామని వివరించారు. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్’లో ప్రపంచ విద్యాసంస్థల భాగస్వామ్యం, క్రీడా రంగ అభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉన్నత స్థాయి అధికారులు తెలిపారు.

# క్షుద్ర పూజల పేరుతో రూ.62 లక్షల మోసం

### అనారోగ్యం నయం చేస్తామంటూ మహిళను నమ్మించి డబ్బుల వసూలు.. ఇద్దరు నిందితుల అరెస్ట్





ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : క్షుద్ర పూజలు, మంత్రాలు, తంత్రాలు, చేతబడులు, దిష్టి తొలగింపు పేరుతో అమాయకులను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులను సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. అనారోగ్యం నయం చేస్తామని నమ్మించి ఓ మహిళ నుంచి సుమారు రూ.62 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు బెల్లంతో తయారు చేసిన బొమ్మలు, పసుపు, కుంకుమ తదితర పూజా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన తురుపాటి శ్యాం కుమార్ (57), తండ్రి రాంచందర్, ప్రస్తుతం హైదరాబాద్ తూముకుంటలో నివాసం ఉంటూ భద్రకాళి పూజా సామాగ్రి దుకాణం నిర్వహిస్తున్నాడు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పత్తెం లక్ష్మీరాజం (60), తండ్రి దుర్గయ్య, ఇతడికి పరిచయస్తుడు. లక్ష్మీరాజం క్షుద్ర పూజలు, మంత్రాలు, తంత్రాలు చేస్తానని చెప్పి ప్రజలను నమ్మించేవాడని పోలీసులు తెలిపారు. ఇద్దరూ కలిసి పూజలు, దీర్ఘకాలిక వ్యాధుల నివారణ, దిష్టి తొలగింపు, చేతబడుల నివారణ పేరుతో అమాయకుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేయాలని పథకం వేసుకున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన బండారి లత జనవరిలో పూజా సామాగ్రి కోసం శ్యాం కుమార్ దుకాణానికి వెళ్లగా, ఆమె అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకుని క్షుద్ర పూజల ద్వారా నయం చేస్తామని నమ్మించినట్లు తెలిపారు. ఫిబ్రవరిలో సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద లతను లక్ష్మీరాజంకు పరిచయం చేశారు. పూజలు, పూజా సామాగ్రి ఖర్చుల పేరుతో మొదట రూ.10 లక్షలు, అనంతరం యాదగిరిగుట్ట వద్ద రూ.21 లక్షలు, కాశీలో రూ.13 లక్షలు నగదుగా తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా వివిధ బ్యాంకు ఖాతాలకు విడతల వారీగా డబ్బులు బదిలీ చేయించి మొత్తం సుమారు రూ.62 లక్షలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. అయితే డబ్బులు తీసుకున్నప్పటికీ అనారోగ్యం నయం కాకపోవడంతో లత తన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిందితులను కోరింది. దీంతో క్షుద్ర పూజలు, చేతబడులతో తనను, తన కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా భవిష్యత్తులో బ్లాక్‌మెయిల్ చేసేందుకు తెల్ల కాగితాలపై ఆమె సంతకాలు తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆమె పొలంలో గుప్త నిధులు ఉన్నాయని, వాటిని వెలికితీసి డబ్బులు ఇస్తామని కూడా నమ్మించినట్లు తెలిపారు. ఈ నెల 23న డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి సిరిసిల్ల పాత బస్టాండ్‌కు రావాలని లతను పిలిపించి నిందితులు అక్కడికి రాకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీసులు Crime No.478/2026, U/s 318(4), 316(2), 308(5) r/w 3(5) BNS, Sec.7 of Drugs and Magic Remedies Act, 1954 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అగ్రహారం గ్రామంలోని లక్ష్మీరాజం ఇంటి వద్ద ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.30,50,000 నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు బెల్లం బొమ్మలు, పసుపు, కుంకుమ తదితర పూజా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించారు. క్షుద్ర పూజలు, చేతబడులు, గుప్త నిధులు, అనారోగ్యం నయం చేస్తామనే పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## డాలర్‌తో పోలిస్తే బలపడ్డ రూపాయి... రాత్రికి రాత్రే 40 పైసలు జంప్



ఇరాన్ ఉద్రిక్తతల మధ్య వచ్చిన శాంతి వార్తలతో రూపాయి బలపడింది. గ్లోబల్ పరిణామాలు, దేశీయ ఆర్థిక నిర్ణయాలు కలిసివచ్చి మార్కెట్‌లో కొత్త ఆశలను కలిగిస్తున్నాయి. రూపాయి నేటి రేటు, భారత్ డాలర్ మార్పిడి, ఆర్బీఐ పాలసీ వార్తలు, ఇరాన్ కాల్పుల విరమణ, బ్రెంట్ క్రూడ్ ధర, భారతీయ కరెన్సీ, ఫారెక్స్ వార్తలు భారత్, డాలర్ రూపాయి ట్రెండ్ ఇరాన్‌తో రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించామని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం రాత్రి ప్రకటించిన తర్వాత, ఏప్రిల్ 8న భారత రూపాయి దాదాపు 40 పైసలు పెరిగి ప్రారంభమైందని మనీకంట్రోల్ రిపోర్ట్ చేసింది. ట్రంప్ తనే పెట్టుకున్న రాత్రి 8 గంటల గడువు ముగియడానికి కొన్ని గంటల ముందు ఈ నిర్ణయం ప్రకటించారు. మునుపటి ట్రేడింగ్ సెషన్‌లో డాలర్‌కు రూ. 93.00 ఉండగా, ఇప్పుడు రూపాయి విలువ రూ. 92.64 వద్ద ట్రేడ్ అవుతోంది. రూపాయి నేటి రేటు, భారత్ డాలర్ మార్పిడి, ఆర్బీఐ పాలసీ వార్తలు, ఇరాన్ కాల్పుల విరమణ, బ్రెంట్ క్రూడ్ ధర, భారతీయ కరెన్సీ, ఫారెక్స్ వార్తలు భారత్, డాలర్ రూపాయి ట్రెండ్ ఈ ప్రకటన తర్వాత బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ దాదాపు 10 శాతం పడిపోయి బ్యారెల్‌కు సుమారు 95 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఇజ్రాయెల్ కూడా భాగమైన ఈ రెండు వారాల కాల్పుల విరమణ నిర్ణయం, హోర్ముజ్ స్ట్రైట్ అనే ముఖ్యమైన ఎనర్జీ మార్గాన్ని సురక్షితంగా తెరవడానికి పాకిస్తాన్ డిప్లొమాట్స్ ఒత్తిడి చేయడంతో వచ్చింది. ఎనర్జీ దిగుమతులపై ఆధారపడే భారతదేశానికి ఇది మంచి వార్తగా భావిస్తున్నారు. రూపాయి నేటి రేటు, భారత్ డాలర్ మార్పిడి, ఆర్బీఐ పాలసీ వార్తలు, ఇరాన్ కాల్పుల విరమణ, బ్రెంట్ క్రూడ్ ధర, భారతీయ కరెన్సీ, ఫారెక్స్ వార్తలు భారత్, డాలర్ రూపాయి ట్రెండ్ సీఆర్ ఫారెక్స్ అడ్వైజరీ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ పబారి మనీకంట్రోల్‌తో మాట్లాడుతూ, రూపాయి స్థిరంగా మారుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు. మంగళవారం వరుసగా మూడో రోజు లాభాలు నమోదయ్యాయని తెలిపారు. ఇది కేవలం గ్లోబల్ పరిస్థితుల వల్ల మాత్రమే కాదు, దేశీయ నియంత్రణ చర్యల వల్ల కూడా సాధ్యమైందని చెప్పారు. రూపాయి నేటి రేటు, భారత్ డాలర్ మార్పిడి, ఆర్బీఐ పాలసీ వార్తలు, ఇరాన్ కాల్పుల విరమణ, బ్రెంట్ క్రూడ్ ధర, భారతీయ కరెన్సీ, ఫారెక్స్ వార్తలు భారత్, డాలర్ రూపాయి ట్రెండ్ దేశీయంగా చూస్తే, మార్కెట్‌లో ఉన్నవారు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంటే ఆర్బీఐ పాలసీ నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూశారు. వడ్డీ రేట్లు అలాగే ఉంచింది ఆర్‌బీఐ.

## సామాన్యులకు మరో షాక్.. భారీగా పెరగనున్న ఆయిల్ ధరలు..



ముడి చమురు, పామాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో, పెరుగుతున్న ముడిసరుకుల ఖర్చుల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగవచ్చని గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికో వంటి కంపెనీలు సూచించాయి. పశ్చిమ ఆసియాలో యుద్ధ ఉద్రిక్తతలు కొంత తగ్గుతున్నట్లుగా కనిపిస్తున్నప్పటికీ, వాటి ప్రభావం భారతదేశంలో సాధారణ ప్రజల రోజువారీ జీవనంపై పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కిచెన్ ఖర్చులు, కుటుంబ బడ్జెట్‌పై ఇది ప్రభావం చూపనుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు , పామ్ ఆయిల్ ధరలు పెరగడంతో, దేశంలోని ప్రముఖ FMCG కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను పెంచే సూచనలు ఇస్తున్నాయి. ధరలు ఎందుకు పెరగవచ్చు అంటే, పశ్చిమ ఆసియాలో జరిగిన సంఘటనల కారణంగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 100 నుంచి 110 డాలర్ల మధ్యకు చేరాయి. అదే సమయంలో పామ్ ఆయిల్ ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. గోద్రేజ్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్, డాబర్, మారికో వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తి ఖర్చులు 6 నుంచి 9 శాతం వరకు పెరిగాయని వెల్లడించాయి. ఈ కంపెనీలు సబ్బులు, నూనెలు మరియు ఇతర గృహోపయోగ వస్తువుల తయారీలో ఈ ముడి పదార్థాలను విస్తృతంగా ఉపయోగిస్తాయి.

## భారత తొలి బుల్లెట్ రైలు రెడీ..

భారత్‌లో తొలి బుల్లెట్ ట్రైన్ పట్టాలపై పరుగులు పెట్టనుంది. దీనికి రైల్వే శాఖ ఒక తేదీని ఫిక్స్ చేసింది. అప్పుడే బుల్లెట్ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. మరి ఆ రైలు ఫీచర్లు, వేగం తెలుసుకుందాం. భారతదేశపు తొలి స్వదేశీ బుల్లెట్ రైలు బి28(దీ28) పట్టాలెక్కే సమయం ఆసన్నమైంది. మార్చి 2027 నాటికి ఈ హైస్పీడ్ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. బెంగళూరులోని బీఈఎమ్ఎల్ రైలు కోచ్ కాంప్లెక్స్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టింది. అక్టోబర్ 2024లో చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆదేశాలు వెలువడ్డాయి. ప్రస్తుతం రెండు రైలు సెట్ల తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రైలు గంటకు గరిష్ఠంగా 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. పట్టాలపై దీని నిర్వహణ వేగం 250 కిలోమీటర్లుగా నిర్ణయించారు. ప్రయాణికుల సేవలు ప్రారంభించే ముందు క్షేత్రస్థాయిలో అనేక కఠినమైన పరీక్షలు నిర్వహిస్తారు. భారత రైల్వే చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవబోతోంది. విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా సొంతంగా బుల్లెట్ రైలును నిర్మించడం ద్వారా దేశ గౌరవం అంతర్జాతీయ స్థాయిలో మరింత పెరగనుంది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. దాదాపు రూ.866.87 కోట్ల ఒప్పంద విలువతో ఈ రైలు తయారవుతోంది. ప్రతి రైలులో ఎనిమిది కోచ్‌లు ఉంటాయి. వీటిలో పూర్తిగా ఎయిర్ కండిషన్డ్ చైర్ కార్ వసతి కల్పిస్తున్నారు. ప్రయాణికులు సౌకర్యవంతంగా కూర్చునేలా వెనక్కి వాలే సీట్లను అమర్చారు. అవసరానికి తగినట్లుగా 180 డిగ్రీల మేర ఈ సీట్లను తిప్పుకోవచ్చు. ప్రయాణంలో వినోదం కోసం అధునాతన ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. శారీరక ఇబ్బందులు ఉన్న ప్రయాణికుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు. వేగం, సౌకర్యం, అత్యాధునిక హంగుల కలయికగా ఈ బి28 రైలు రూపుదిద్దుకుంటోంది. ఈ స్వదేశీ ప్రాజెక్టు వల్ల ఇతర దేశాల నుంచి రైలు పెట్టెలను దిగుమతి చేసుకునే భారం తగ్గనుంది. భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా బీఈఎమ్ఎల్ ఈ రైలును డిజైన్ చేసింది.

# విదేశీ యాప్‌తో ఇండియాలో పేమెంట్... బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్త యూపీఐ సదుపాయం



బ్యాంక్ ఆఫ్ బరోడా యూపీఐ గ్లోబల్ రివర్స్ యాక్సెప్టెన్స్ ప్రారంభించింది. విదేశీ పర్యాటకులు తమ దేశ పేమెంట్ యాప్‌లతో భారత్‌లో చెల్లింపులు చేయవచ్చు. విదేశాల నుంచి భారత్‌కు వచ్చే పర్యాటకులు, ఓవర్సీస్ ఇండియన్స్, అలాగే అర్హత ఉన్న దేశాల్లోని విదేశీ వాలెట్ లేదా పేమెంట్ యాప్‌లను వాడేవారికి బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్త సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక వీరు తమ దేశంలో వాడే బ్యాంకింగ్ లేదా పేమెంట్ యాప్‌తోనే భారత్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా యూపీఐ క్యూఆర్ కోడ్ ఉన్న వ్యాపార సంస్థల్లో నేరుగా చెల్లింపులు చేయొచ్చు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ సదుపాయాన్ని యూపీఐ గ్లోబల్ రివర్స్ యాక్సెప్టెన్స్ పేరుతో ప్రారంభించింది. దీని వల్ల అంతర్జాతీయ పర్యాటకులకు భారత్‌లో డిజిటల్ పేమెంట్లు మరింత సులభం కానున్నాయి. అదే సమయంలో బ్యాంక్ ఆఫ్ బరోడా యూపీఐ క్యూఆర్ ఉన్న వ్యాపారులకు కూడా మరింత పెద్ద కస్టమర్ బేస్ అందుబాటులోకి వస్తుంది. ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ లక్ష్యమైన గ్లోబల్ ఇంటర్‌ఆపరబిలిటీకి అనుగుణంగా ఈ సదుపాయాన్ని తీసుకొచ్చారు. అంటే, వివిధ దేశాల డిజిటల్ పేమెంట్ వ్యవస్థలు ఒకదానితో ఒకటి పనిచేసేలా చేయడం. ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ గ్లోబల్ పేమెంట్స్ ఎకోసిస్టమ్‌లో భాగమైన దేశాల నుంచి వచ్చే విదేశీ సందర్శకులు భారత్‌లో పర్సన్-టు-మర్చంట్, అంటే పీ2ఎం లావాదేవీలు చేయొచ్చు. ఈ సదుపాయం అందుబాటులో ఉండే ముఖ్యమైన అంతర్జాతీయ మార్గాల్లో సింగపూర్, యూఏఈ, నేపాల్, భూటాన్, మారిషస్, శ్రీలంక, అమెరికా, ఖతార్, ఫ్రాన్స్ వంటి దేశాలు ఉన్నాయి. వీటితో పాటు మరికొన్ని దేశాల వినియోగదారులు కూడా ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోగలరు. విదేశీ సందర్శకులు బ్యాంక్ ఆఫ్ బరోడా యూపీఐ క్యూఆర్ కోడ్‌ను తమ దేశంలో వాడే బ్యాంకింగ్ లేదా పేమెంట్ యాప్‌తో స్కాన్ చేస్తే చాలు. వెంటనే చెల్లింపు పూర్తి చేయొచ్చు. దీంతో భారత్‌లో ప్రయాణించే సమయంలో చేతిలో ఎక్కువ నగదు పెట్టుకోవాల్సిన అవసరం తగ్గుతుంది. విదేశీ కరెన్సీని భారత కరెన్సీగా మార్చుకోవాల్సిన అవసరం కూడా తగ్గుతుంది. ప్రయాణికులకు పేమెంట్ అనుభవం మరింత సులభంగా ఉంటుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ ముదలియార్ మాట్లాడుతూ, "యూపీఐ గ్లోబల్ రివర్స్ యాక్సెప్టెన్స్‌ను తీసుకురావడం బ్యాంక్ ఆఫ్ బరోడాకు గర్వకారణం. సరిహద్దులు దాటి డిజిటల్ పేమెంట్లు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో ఇది ముఖ్యమైన అడుగు. విదేశీ సందర్శకులు ఇప్పటికే వాడుతున్న, వారికి పరిచయం ఉన్న పేమెంట్ యాప్‌ల ద్వారానే వ్యాపార సంస్థలకు చెల్లింపులు చేసే అవకాశం కల్పిస్తున్నాం. దీనివల్ల ప్రయాణికులకు సౌకర్యం పెరుగుతుంది. మా వ్యాపారులకు కొత్త వ్యాపార అవకాశాలు కూడా వస్తాయి. యూపీఐ గ్లోబల్ రివర్స్ యాక్సెప్టెన్స్‌తో మా మర్చంట్ అక్వైరింగ్ వ్యాపారం మరింత బలపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఒకదానితో ఒకటి పనిచేసే డిజిటల్ పేమెంట్ వ్యవస్థను నిర్మించాలన్న బ్యాంక్ ఆఫ్ బరోడా నిబద్ధతను ఇది చూపిస్తుంది" అని చెప్పారు.

# సెప్టెంబర్ 9న ఆపిల్ ఈవెంట్ .. ఫోల్డబుల్ ఐఫోన్ కూడా వస్తుందా?



వారాలుగా కొనసాగుతున్న ఊహాగానాలకు చాజూజూశ్రీవ తెరదించింది. సెప్టెంబర్ 9న జరగనున్న భారీ ఈవెంట్‌లో తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ను కూడా తీసుకురాబోతోందా? టెక్ ప్రపంచంలో కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. తన తదుపరి కీలక లాంచ్ ఈవెంట్ తేదీని అధికారికంగా ప్రకటించింది. సెప్టెంబర్ 9, బుధవారం నాడు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ ఈవెంట్‌లో సహా పలు కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించే అవకాశం ఉంది. అంతేకాకుండా తొలిసారిగా ఫోల్డబుల్ ఐఫోన్‌ను పరిచయం చేయవచ్చనే అంచనాలు కూడా టెక్ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. వరల్డ్‌వైడ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గ్రెగ్ జోస్వియాక్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ శలో ఈ విషయాన్ని వెల్లడించారు. సెప్టెంబర్ 9న చాజూజూశ్రీవజుజవత్ జరగనుందని ఆయన ప్రకటించడంతో ఇప్పటివరకు ఉన్న ఊహాగానాలకు అధికారికంగా ముగింపు లభించింది. నిర్వహించే ఈ కీలక కీనోట్ అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం కుపర్టినోలో ఉన్న జరగనుంది. కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. భారత కాలమానం ప్రకారం ఇది రాత్రి 10:30 గంటలకు ప్రారంభమవుతుంది. సాధారణంగా చాజూజూశ్రీవ ఉత్పత్తుల లాంచ్ ఈవెంట్లు ఒకటి నుంచి రెండు గంటల పాటు కొనసాగుతాయి. ఈ కార్యక్రమం కూడా అదే తరహాలో ఉండే అవకాశం ఉంది. అయితే వీటితో పాటు చరిత్రలో మరో కీలక ఉత్పత్తి కూడా వేదికపైకి రావచ్చనే చర్చ జరుగుతోంది. అదే ఫోల్డబుల్. కంపెనీ తొలిసారిగా ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లోకి అడుగుపెడితే, సెప్టెంబర్ 9 ఈవెంట్ అత్యంత ప్రాధాన్యమైన లాంచ్‌లలో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. సిరీస్‌లోనూ తాజా మోడళ్లను లేదా అప్‌డేట్లను కంపెనీ ప్రకటించే అవకాశం ఉంది. మరోవైపు కొత్త కంప్యూటర్లకు మాత్రం అధికారికంగా తేదీని ఖరారు చేయడంతో అందరి దృష్టి సెప్టెంబర్ 9పైకి మళ్లింది. ముఖ్యంగా ఊప్త్రశీఅవ 18 ౯తీశీ సిరీస్‌తో పాటు ఫోల్డబుల్ ఐఫోన్‌ను కంపెనీ నిజంగానే ఆవిష్కరిస్తుందా అన్నదే టెక్ ప్రపంచంలో ప్రధాన ఉత్కంఠగా మారింది.

# ఇన్‌స్టామార్ట్‌కి షాకిచ్చిన ఫ్లిప్‌కార్ట్ మినిట్స్... హైదరాబాద్‌లో టాప్ ఎవరో తెలుసా?




క్విక్ కామర్స్ పోటీలో ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ దూకుడు చూపిస్తోంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌ను అధిగమించి 627 డార్క్ స్టోర్లతో మూడో స్థానంలో నిలిచింది. బ్లింకిట్, జెప్టో ముందున్నాయి. క్విక్ కామర్స్ రంగంలో పోటీ రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా పెద్ద నగరాల్లో కొన్ని నిమిషాల్లోనే సరుకులు డెలివరీ చేసే సేవలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ పోటీలో ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ కీలక ముందడుగు వేసింది. దేశంలోని టాప్ 10 క్విక్ కామర్స్ నగరాల్లో డార్క్ స్టోర్ల సంఖ్యలో స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌ను ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ అధిగమించింది. సీఎల్ఎస్ఏ రిపోర్ట్ ప్రకారం, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌కు 627 డార్క్ స్టోర్లు ఉండగా, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు 615 ఉన్నాయి. రెండు కంపెనీల మధ్య తేడా కేవలం 12 స్టోర్లు మాత్రమే. అయినా ఇది ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ వ్యాపారం ఎంత వేగంగా పెరుగుతోందో చూపిస్తోంది. ఇప్పటికే బలమైన నెట్‌వర్క్ ఉన్న కంపెనీలు కూడా తమ డార్క్ స్టోర్ల సంఖ్యను పెంచుకుంటున్న సమయంలో ఈ మార్పు వచ్చింది. సీఎల్ఎస్ఏ క్విక్ కామర్స్ మ్యాప్ ప్రకారం, ఈ 10 నగరాల్లో మొత్తం 3,536 డార్క్ స్టోర్లు ఉన్నాయి. వీటిలో 969 స్టోర్లతో బ్లింకిట్ మొదటి స్థానంలో ఉంది. 828 స్టోర్లతో జెప్టో రెండో స్థానంలో ఉంది. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ 627 స్టోర్లతో మూడో స్థానంలో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 615 స్టోర్లతో నాలుగో స్థానంలో ఉన్నాయి. బిగ్‌బాస్కెట్‌కు 497 డార్క్ స్టోర్లు ఉన్నాయి. 10 నగరాల్లో ఆరు చోట్ల బ్లింకిట్‌కు అత్యధిక స్టోర్లు ఉన్నాయి. బెంగళూరు, ఢిల్లీ, పుణె, గురుగ్రామ్, లక్నో, అహ్మదాబాద్ నగరాల్లో బ్లింకిట్ ముందంజలో ఉంది. హైదరాబాద్, ముంబై, చెన్నైలో జెప్టో మొదటి స్థానంలో ఉంది. కోల్‌కతాలో మాత్రం ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌కు అత్యధిక డార్క్ స్టోర్లు ఉన్నాయి. క్విక్ కామర్స్ కంపెనీలు ఇప్పటికే ఉన్న మార్కెట్లలో తమ నెట్‌వర్క్‌ను మరింత పెంచుకుంటున్నాయని, అదే సమయంలో కొత్త ప్రాంతాల్లో మాత్రం ఎంపిక చేసుకుని అడుగుపెడుతున్నాయని సీఎల్ఎస్ఏ రిపోర్ట్ తెలిపింది. ఎటర్నల్‌కు చెందిన బ్లింకిట్ ఈ విస్తరణలో ఇప్పటికీ ముందంజలో ఉంది. కొత్త మార్కెట్లలోకి వెళ్లినప్పుడు కంపెనీలు వెంటనే పెద్ద సంఖ్యలో డార్క్ స్టోర్లు ఏర్పాటు చేయడం లేదు. ముందుగా అక్కడి కస్టమర్ల డిమాండ్ ఎలా ఉందో చూస్తున్నాయి. ఒక్కో స్టోర్ నుంచి వచ్చే ఆదాయం, ఖర్చులు ఎలా ఉన్నాయో కూడా పరిశీలిస్తున్నాయి. పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఆ తర్వాత నెట్‌వర్క్‌ను పెంచుతున్నాయి. అదే సమయంలో కొత్తగా ఎదుగుతున్న కంపెనీలు పెద్ద కంపెనీలకు ఇంకా పెద్దగా చేరని ప్రాంతాలపై దృష్టి పెడుతున్నాయి. అక్కడ ముందుగానే తమ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి కస్టమర్లను సంపాదించుకోవాలని చూస్తున్నాయి. ఈ వ్యూహం వల్ల మొదట మార్కెట్లోకి వచ్చిన కంపెనీకి ప్రయోజనం దక్కే అవకాశం ఉంటుంది. ఈ జాబితాలో బెంగళూరు అతిపెద్ద క్విక్ కామర్స్ మార్కెట్‌గా ఉంది. ట్రాక్ చేసిన కంపెనీలకు అక్కడ మొత్తం 735 స్టోర్లు ఉన్నాయి. బ్లింకిట్‌కు 180 స్టోర్లు ఉండగా, జెప్టో 177 స్టోర్లతో దానికి చాలా దగ్గరగా ఉంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు 143 స్టోర్లు, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌కు 119 స్టోర్లు ఉన్నాయి.

# భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె అనయా బంగర్, లింగ మార్పిడి



శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత పోటీ క్రికెట్‌లోకి తిరిగి వచ్చే అవకాశం పొందింది. భారతదేశంలో క్రికెట్ ఆడే మార్గం అనిశ్చితంగా ఉన్నప్పటికీ, ఆస్ట్రేలియాలో తన క్రికెట్ కెరీర్‌ను తిరిగి ప్రారంభించేందుకు అనయా బంగర్‌కు అవకాశం లభించింది. భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె అనయా బంగర్, లింగ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత పోటీ క్రికెట్‌లోకి తిరిగి వచ్చే అవకాశం పొందింది. భారతదేశంలో క్రికెట్ ఆడే మార్గం అనిశ్చితంగా ఉన్నప్పటికీ, ఆస్ట్రేలియాలో తన క్రికెట్ కెరీర్‌ను తిరిగి ప్రారంభించేందుకు అనయా బంగర్‌కు అవకాశం లభించింది. క్రికెట్ ఆడాలన్న తన తపన, కోరిక తీరడంతో ఇప్పుడు ఆమె పోటీ క్రికెట్‌లోకి తిరిగి రావడానికి సిద్ధం కావడమే కాకుండా ప్రాక్టీస్ కూడా ముమ్మరం చేసింది. భవిష్యత్తులో ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్‌లో కూడా ఆడాలని ఆశిస్తోంది. తండ్రి భారత మాజీ క్రికెట్ అయినప్పటికి కూతురు ఆస్ట్రేలియా క్రికెటర్‌గా మారింది. ముందుగా క్రికెటర్ కావాలనే ఆమెకు తగిన అర్హతకు సంబంధించిన పూర్తి వివరాలను క్రికెట్ ఆస్ట్రేలియా పరిశీలించింది. అనయా వైద్య నివేదిక, పరిశోధన పత్రాలను చెక్ చేసిన తర్వాతే ఆమె తక్షణమే ఆస్ట్రేలియాలో కమ్యూనిటీ క్రికెట్ ఆడటానికి అనుమతి పొందింది. ఈ నిర్ణయం తనకు ఒక కొత్త ఆరంభమని అనయా అభివర్ణించింది. ఒకానొక సమయంలో తాను మళ్లీ క్రికెట్ ఆడలేనేమో అని అనుకున్నానని కానీ క్రికెట్ ఆస్ట్రేలియా తనకు రెండవ అవకాశం ఇచ్చిందని అనయా బంగర్ బాగా ఎమోషనల్ అవుతూ చెప్పింది. ఈ అనుమతి అతనికి క్రికెట్‌లోకి తిరిగి రావడమే కాకుండా, చిన్నప్పటి నుండి తనతో ఉన్న ఆటకు తిరిగి అనుబంధం ఏర్పరచుకోవడానికి లభించిన ఒక అద్భుతమైన అవకాశంగా భావిస్తున్నట్లు చెప్పింది. అనయా బంగర్‌కి ఆస్ట్రేలియాలో ఆమోదం లభించినప్పటికీ భారతదేశంలో మహిళలు క్రికెట్ ఆడే మార్గం ఇంకా అస్పష్టంగానే ఉందని అనయా అంటోంది. దేశీయ క్రికెట్ ఆడే ట్రాన్స్‌జెండర్ మహిళలపై బీసీసీఐ ఇంకా అధికారిక విధానాన్ని రూపొందించలేదు. అనయా ప్రకారం ఆమె ఈ విషయమై బీసీసీఐకి ఇమెయిల్ చేసినప్పటికీ, ఇంకా స్పష్టమైన సమాధానం రాలేదు. అంతర్జాతీయ స్థాయిలో 2023లో ఐసీసీ ఒక విధానాన్ని అమలు చేసింది. దీని ప్రకారం పురుషులుగా యుక్తవయస్సు పొందిన ట్రాన్స్‌జెండర్ మహిళలను మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడేందుకు అనుమతించరు. కాబట్టి భారతదేశంలో ఆమెకు ఆడే అవకాశం లభించే అవకాశాలు చాలా తక్కువ. భవిష్యత్తులో ఏమైనా కల్పిస్తుందేమో చూడాలి. ముంబైలో జన్మించిన అనయ బంగర్ అండర్-19 స్థాయిలో ముంబైకి ప్రాతినిధ్యం వహించింది. ఈ సమయంలో సర్ఫరాజ్ ఖాన్ సోదరుడు ముషీర్ ఖాన్ వంటి ఆటగాళ్లతో కలిసి ఆడింది. తండ్రి సంజయ్ బంగర్ భారతదేశం తరపున 12 టెస్టులు, 15 వన్డేలు ఆడారు. రిటైర్ అయిన తర్వాత భారత జట్టుకు కోచ్‌గా కూడా పని చేశాడు. ఆమె ప్రస్తుతం ఆస్ట్రేలియన్ ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్‌పై దృష్టి సారించింది. కానీ ఆమె వరుసగా 12 నెలల పాటు తన సీరం టెస్టోస్టెరాన్ స్థాయిలను 10 అఎశీశ్రీ/ా కంటే తక్కువగా ఉంచుకోవాల్సి ఉంటుంది. ఆమె ముందుగా ఎలైట్ మహిళల క్రికెట్‌లో ఆడేందుకు అర్హత సాధించాలి. ఆ తర్వాత దేశీయ స్థాయిలో రాణించాల్సి ఉంటుంది. ఆమె బాగా ఆడితే డబ్ల్యూబీబీఎల్‌లో ఆడగలనని అనయా ఆశిస్తోంది. ఇది ఆమెకు వ్యక్తిగత విజయం మాత్రమే కాకుండా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆటగాళ్లకు కూడా ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుంది గతంలో అనయా తండ్రి ఇండియాకు క్రికెట్‌లో పేరు తెస్తే .. ఇప్పుడు ఈ ట్రాన్స్‌జెండర్ మహిళా క్రికెటర్‌గా ఆస్ట్రేలియాకు పేరు తెచ్చుకునేందుకు ఏకంగా ట్రాన్స్‌జెండర్ నుంచి మహిళగా సర్జరీ చేయించుకోవడం ఇదే మొదటిసారిగా తెలుస్తోంది.

# 4 ఫ్రాంచైజీలు.. 191 మంది ప్లేయర్స్.. నేడే డబ్ల్యూఏపీఎల్ వేలం!

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిభావంతులైన మహిళా క్రికెటర్లను ప్రోత్సహించి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ మహిళల ప్రీమియర్ లీగ్ (ఔ్రూూ) కీలక దశకు చేరుకుంది. విజయవాడ వేదికగా నేడు (మంగళవారం) ప్లేయర్స్ వేలం ప్రక్రియ అత్యంత వైభవంగా జరగనుంది. ఈ వేలంలో పాల్గొని మహిళా క్రీడాకారిణులను దక్కించుకునేందుకు నాలుగు ఫ్రాంచైజీలు సర్వసన్నద్ధమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మొత్తం 191 మంది క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకోగా, వారిలో 80 మందికి లీగ్‌లో ఆడే అవకాశం దక్కనుంది. ఈ వేలం మధ్యాహ్నం 12 గంటలకు ఆరంభం కానుంది. ఈ వేలాన్ని యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఝుజూశ్రీఎశీబ్‌బఎవ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. వేలంలో పాల్గొనే నాలుగు జట్లకు సమాన అవకాశాలు కల్పించేలా ఏసీఏ కఠిన నిబంధనలు రూపొందించింది. ఒక్కో ఫ్రాంచైజీ గరిష్ఠంగా 20 మంది క్రికెటర్లను తమ జట్టులోకి తీసుకునే వెసులుబాటు ఉంది. అలాగే క్రీడాకారిణుల కొనుగోలు కోసం ఒక్కో జట్టుకు రూ.15 లక్షల పర్స్ లిమిట్‌ను కేటాయించారు. వేలంలో పాల్గొంటున్న 191 మంది క్రికెటర్లను వారి అనుభవం, ప్రతిభ ఆధారంగా రెండు గ్రేడ్‌లుగా విభజించారు. గ్రేడ్-ఎ విభాగం: జాతీయ స్థాయి మ్యాచ్‌ల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వారు, మహిళల ప్రీమియర్ లీగ్ ఆడినవారు, సీనియర్, అండర్-23 విభాగాల్లో రాష్ట్రానికి ఆడిన అనుభవజ్ఞులైన 45 మంది క్రీడాకారిణులను గ్రేడ్-ఎలో చేర్చారు. వీరి కనీస మూలధరను రూ.50 వేలుగా నిర్ణయించారు. ఇందులో ముఖ్యంగా భారత స్టార్ స్పిన్నర్ శ్రీచరణి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు



# మెస్సీ రిటైర్మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పందన

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలకడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా (ఎక్స్) ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. మెస్సీతో తాను కలిసి ఉన్న ఒక అరుదైన చిత్రాన్ని కూడా ఈ సందర్భంగా పోస్ట్ చేశారు. "ప్రియమైన మెస్సీ, మీరు ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఎంతగానో ఉత్తేజపరిచారు. మీ అద్భుతమైన ఆటతీరుతో మమ్మల్ని అలరించడమే కాకుండా, ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. హైదరాబాద్‌లోని ఫుట్‌బాల్ మైదానంలో మీతో గడిపిన క్షణాలను గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. మెస్సీ లేని ఫుట్‌బాల్ మైదానం మునుపటిలా ఉండదు. మీకు ఇవే మా వీడ్కోలు పలుకులు. మీ స్ఫూర్తి ఇలాగే కొనసాగాలి" అని రేవంత్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సందేశంతో పాటు, మెస్సీ తన రిటైర్మెంట్‌పై చేసిన పోస్ట్‌ను కూడా రేవంత్ రెడ్డి షేర్ చేశారు. అంతేకాకుండా, గతంలో హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మెస్సీతో కలిసి ఫుట్‌బాల్ మైదానంలో గడిపిన సమయానికి సంబంధించిన ఫొటోను కూడా ఆయన దీనికి జతచేశారు.

# ఫోన్ పట్టుకున్నా.. గ్లాస్ అందుకున్నా.. షూలేస్ కట్టుకున్నా చేతులు వణుకుతున్నాయా.. కారణం ఇదేనట..!



చేతులు వణుకుతుంటే ఎసెన్షియల్ ట్రెమర్ అనే నాడీ సమస్య కారణం కావచ్చని కళ్యాణి ఆసుపత్రి నిపుణులు హరిప్రసాద్ తెలిపారు. చేతిలో ఫోన్ పట్టుకున్నప్పుడు చేతులు వణకడం.. కాఫీ కప్పు పట్టుకోవాలంటే చేయి అదుపులో లేకపోవడం.. రాస్తున్నప్పుడు అక్షరాలు తడబడటం వంటివి తరచూ జరుగుతున్నాయా..? అయితే దాన్ని కేవలం టెన్షన్, అలసట లేదా వయసు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేయకూడదని తూర్పుగోదావరి జిల్లా తునిలోని కళ్యాణి ఆసుపత్రి నిపుణులు హరిప్రసాద్ తెలిపారు. ముఖ్యంగా ఏదైనా పని చేస్తున్న సమయంలో చేతులు పదేపదే వణుకుతుంటే ఎసెన్షియల్ ట్రెమర్ అనే నాడీ సమస్య కారణం కావచ్చని చెప్పారు. ఎసెన్షియల్ ట్రెమర్‌లో మనకు తెలియకుండానే శరీరంలోని ఒక భాగం వణుకుతుందని హరిప్రసాద్ తెలిపారు. సాధారణంగా చేతులు, ముంజేతుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. కొందరిలో తల, గొంతు వంటి భాగాల్లోనూ వణుకు ఉండొచ్చన్నారు. మొదట్లో వేళ్లలో స్వల్పంగా కనిపించే వణుకు.. కాలక్రమేణా ఎక్కువయ్యే అవకాశం ఉందని, ఒక చేతితో మొదలై రెండు చేతులకూ రావచ్చని వివరించారు. ఫోన్‌లో టైప్ చేయడం, గ్లాస్ పట్టుకోవడం, రాయడం, షూలేస్ కట్టుకోవడం వంటి చిన్న పనులు చేస్తున్నప్పుడు చేతులు ఎక్కువగా వణకడం ఈ సమస్యలో కనిపించే లక్షణమని హరిప్రసాద్ చెప్పారు. అయితే చేతులు వణుకుతున్నంత మాత్రాన అది ఎసెన్షియల్ ట్రెమర్ అని చెప్పలేమన్నారు. పార్కిన్సన్స్ వంటి ఇతర సమస్యల్లోనూ వణుకు ఉండొచ్చని, అందుకే వణుకు ఎప్పుడు వస్తోంది, ఎంతకాలంగా ఉంది, ఇతర లక్షణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను వైద్యులు పరిశీలిస్తారని తెలిపారు. ఒత్తిడి, ఆందోళన, అలసట, నిద్ర సరిగా లేకపోవడం, కాఫీ లేదా ఇతర కెఫీన్ పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల చేతుల వణుకు మరింత ఎక్కువగా కనిపించవచ్చని హరిప్రసాద్ తెలిపారు. ఎసెన్షియల్ ట్రెమర్‌కు ఖచ్చితమైన కారణం పూర్తిగా తెలియకపోయినా.. మెదడులో కదలికలను నియంత్రించే భాగానికి సంబంధించిన నాడీ సంకేతాల్లో మార్పులు దీనికి కారణం కావచ్చని చెప్పారు. కుటుంబంలో ఈ సమస్య ఉన్నవారికి తరువాతి తరాల్లోనూ వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సమస్యను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఒక్క రక్త పరీక్ష లేదా ఒక్క స్కాన్ సరిపోదని హరిప్రసాద్ తెలిపారు. వణుకు స్వభావం, వైద్య చరిత్ర, కుటుంబంలో ఎవరికైనా ఇలాంటి సమస్య ఉందా అనే విషయాలను వైద్యులు పరిశీలిస్తారని చెప్పారు. థైరాయిడ్ సమస్యలు, కొన్ని మందుల ప్రభావం వంటి ఇతర కారణాల వల్ల కూడా చేతులు వణికే అవకాశం ఉందని, అవసరమైన పరీక్షల ద్వారా అసలు కారణాన్ని గుర్తిస్తారని తెలిపారు. స్వల్పంగా ఉన్నప్పుడు అందరికీ మందులు అవసరం ఉండకపోవచ్చన్నారు. చేతుల వణుకు రోజువారీ పనులకు ఇబ్బంది కలిగించే స్థాయికి చేరితే వైద్యుడిని సంప్రదించడం మంచిదని హరిప్రసాద్ సూచించారు. అవసరాన్ని బట్టి కెఫీన్ తగ్గించడం, ఒత్తిడిని నియంత్రించడం, నిద్రను మెరుగుపరచడం వంటి మార్పులతో పాటు వైద్యుల సూచన మేరకు మందులు ఉపయోగించవచ్చని చెప్పారు. వణుకు ఎక్కువగా ఉన్న సందర్భాల్లో మరికొన్ని చికిత్సా విధానాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎసెన్షియల్ ట్రెమర్ సాధారణంగా ప్రాణాంతకమైన సమస్య కాదని, అయితే తరచూ చేతులు వణుకుతుంటే కారణాన్ని తెలుసుకోవడం ముఖ్యమని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

# ఫ్రిజ్‌లో నీటి బిందువులు కనిపిస్తున్నాయా.. అసలు కారణం ఇదై ఉండొచ్చు.. నిపుణుల సలహా ఇదే..!




రిఫ్రిజిరేటర్‌లో నీరు చేరడానికి డోర్ సీల్, ఉష్ణోగ్రత, ఆహార నిల్వ, డ్రెయిన్ లైన్ వంటివి కారణం. సమస్య తీవ్రమైతే నిపుణులను సంప్రదించండి. రిఫ్రిజిరేటర్ తలుపు తెరిచినప్పుడు షెల్ఫ్‌పై నీటి బిందువులు కనిపిస్తున్నాయా? కూరగాయల ట్రే కింద తరచూ నీరు చేరుతోందా? అయితే దాన్ని చిన్న సమస్యగా తీసుకుని వదిలేయడం మంచిది కాదు. కొంత తేమ సాధారణమే అయినప్పటికీ.. పదేపదే నీరు ఏర్పడటం, షెల్ఫ్‌లు తడిగా మారడం లేదా కింద నీరు నిలవడం వెనుక రిఫ్రిజిరేటర్ పనితీరుకు సంబంధించిన కారణమై ఉండొచ్చని.. విజయనగరానికి చెందిన రిఫ్రిజిరేటర్ నిపుణుడు గణేష్ తెలిపారు. ముఖ్యంగా డోర్ సరిగ్గా సీల్ కాకపోవడం నుంచి డ్రెయిన్ మూసుకుపోవడం వరకు పలు కారణాలు దీనికి దారితీయవచ్చు. ముందుగా రిఫ్రిజిరేటర్ డోర్ చుట్టూ ఉన్న రబ్బర్ సీల్‌ను పరిశీలించడం మంచిది. అది ఎక్కడైనా వదులుగా ఉండటం, పగుళ్లు రావడం లేదా సరిగ్గా అతుక్కోకపోవడం వల్ల బయట ఉన్న వేడి గాలి లోపలికి చేరుతుంది. దీంతో తేమ పెరిగి నీటి బిందువులు ఏర్పడే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సీల్ పనితీరును తెలుసుకోవడానికి డోర్--రబ్బర్ మధ్య కాగితం పెట్టి తలుపు మూసి, దాన్ని బయటకు లాగి చూడవచ్చు. కాగితం చాలా సులభంగా బయటకు వస్తే ఆ ప్రాంతంలో సీల్ బలహీనంగా ఉండే అవకాశం ఉంది. సీల్‌పై పేరుకున్న దుమ్ము, ఆహారపు ముక్కలు, జిగట మురికిని గోరువెచ్చని సబ్బు నీటితో శుభ్రం చేసి పూర్తిగా ఆరబెట్టాలి. రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రత కూడా ఈ సమస్యలో కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా లోపలి ఉష్ణోగ్రతను సుమారు 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంచడం అనుకూలంగా ఉంటుంది. డయల్‌పై ఉన్న సెట్టింగ్‌ను మాత్రమే నమ్మకుండా అవసరమైతే ప్రత్యేక థర్మామీటర్‌తో ఉష్ణోగ్రతను తనిఖీ చేయడం మంచిది. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే తేమ నీటి బిందువులుగా మారవచ్చు. అదే సమయంలో మరీ తక్కువ ఉష్ణోగ్రతతో వెనుక గోడపై అధికంగా మంచు ఏర్పడి, అది కరిగినప్పుడు నీరు చేరే అవకాశం కూడా ఉంటుంది. లోపల పెట్టే ఆహారం విషయంలోనూ కొన్ని జాగ్రత్తలు అవసరం. వేడి ఆహారాన్ని వెంటనే ఫ్రిజ్‌లో పెట్టడం, మిగిలిపోయిన పదార్థాలను మూత లేకుండా ఉంచడం, కడిగిన కూరగాయలను తడిగానే నిల్వ చేయడం వల్ల లోపల తేమ పెరుగుతుంది. పండ్లు, కూరగాయలు కూడా సహజంగా కొంత తేమను విడుదల చేస్తాయి. అందుకే మిగిలిన ఆహారాన్ని గట్టిగా మూసుకునే డబ్బాల్లో ఉంచడం, కూరగాయలను నిల్వ చేసే ముందు వాటిపై ఉన్న అదనపు నీటిని తొలగించడం మంచిది. అలాగే ఫ్రిజ్‌లోని వస్తువులను అడ్డదిడ్డంగా కుక్కిపెట్టకుండా.. చల్లటి గాలి తిరిగే మార్గాలకు ఖాళీ ఉంచాలి. కూరగాయల ట్రే కింద లేదా ఫ్రిజ్ లోపల ఒకే చోట నీరు పదేపదే నిలుస్తుంటే డ్రెయిన్ లైన్ కూడా కారణం కావచ్చు. ఫ్రిజ్‌లో ఏర్పడే అదనపు నీరు బయటకు వెళ్లేందుకు ఉండే చిన్న డ్రెయిన్ ఆహారపు రేణువులు లేదా మురికితో మూసుకుపోతే నీరు లోపలే నిలిచిపోతుంది.

# బీరకాయ టమాట పచ్చడి ఇలా చేస్తే అదిరిపోయే రుచి.. అన్నం ప్లేట్ ఖాళీ అవ్వాల్సిందే!



వేడి వేడి అన్నంలో కొద్దిగా నెయ్యి వేసుకుని ఈ పచ్చడిని కలుపుకుని తింటే చాలా రుచిగా ఉంటుంది. ఇడ్లీ, దోసె, పెసరట్టు వంటి టిఫిన్లతో కూడా దీనిని తినవచ్చు. బీరకాయ టమాటా రోటి పచ్చడి తెలుగు వంటకాలలో ఎంతో రుచికరమైన పచ్చడుల్లో ఒకటి. సాధారణంగా టమాటా, వంకాయ, దోసకాయ వంటి పచ్చళ్లను ఎక్కువగా తయారు చేస్తుంటాం. కానీ ఈసారి కాస్త వెరైటీగా బీరకాయ, టమాటాతో ఈ రుచికరమైన పచ్చడిని తయారు చేసి చూడండి. బీరకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో పచ్చడి మెత్తగా, రుచిగా ఉంటుంది. టమాటా పులుపు, పచ్చిమిర్చి కారం, నువ్వులు, వెల్లుల్లి రుచి కలవడంతో పచ్చడికి మంచి రుచి వస్తుంది. వేడి వేడి అన్నంలో కొద్దిగా నెయ్యి వేసుకుని ఈ పచ్చడిని కలుపుకుని తింటే చాలా రుచిగా ఉంటుంది. ఇడ్లీ, దోసె, పెసరట్టు వంటి టిఫిన్లతో కూడా దీనిని తినవచ్చు. ఈ పచ్చడి తయారు చేయడానికి ముందుగా పావుకిలో తాజా బీరకాయలను తీసుకుని పొట్టు తీసి శుభ్రంగా కడగాలి. వాటిని చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి. అలాగే రెండు పెద్ద టమాటాలను కూడా చిన్న ముక్కలుగా కోసుకోవాలి. పచ్చిమిర్చి, వెల్లుల్లి, కొత్తిమీరను సిద్ధంగా ఉంచుకోవాలి. ఒక పాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడయ్యాక జీలకర్ర, మెంతులు, నువ్వులు, మినపప్పు, శనగపప్పు వేసి మంచి వాసన వచ్చే వరకు దోరగా వేయించాలి. తర్వాత పచ్చిమిర్చి, వెల్లుల్లి వేసి కొద్దిసేపు వేయించాలి. అవి కాస్త రంగు మారిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకుని చల్లార్చాలి. ఇప్పుడు అదే పాన్‌లో మిగిలిన నూనె వేసి వేడి చేయాలి. అందులో బీరకాయ ముక్కలు, కొద్దిగా పసుపు వేసి బాగా కలపాలి. మూత పెట్టి మీడియం మంటపై బీరకాయ ముక్కలు మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. బీరకాయ సగానికి పైగా ఉడికిన తర్వాత టమాటా ముక్కలు, రుచికి సరిపడా ఉప్పు వేసి మరోసారి మూత పెట్టాలి. బీరకాయ, టమాటా రెండూ మెత్తగా ఉడికే వరకు మగ్గించాలి. నీళ్లు ప్రత్యేకంగా పోయాల్సిన అవసరం లేదు. బీరకాయ, టమాటాల్లో ఉండే నీటితోనే అవి ఉడుకుతాయి. తర్వాత ముందుగా వేయించి చల్లార్చిన పచ్చిమిర్చి, వెల్లుల్లి మిశ్రమాన్ని మిక్సీ జార్‌లో వేసి బరకగా గ్రైండ్ చేయాలి. అందులో ఉడికించిన బీరకాయ, టమాటా మిశ్రమం, కొద్దిగా చింతపండు, కొత్తిమీర వేసి మరోసారి బరకగా గ్రైండ్ చేసుకోవాలి. పచ్చడిని మరీ మెత్తగా కాకుండా కాస్త కచ్చాపచ్చాగా రుబ్బితే రుచి మరింత బాగుంటుంది. వీలైతే మిక్సీకి బదులుగా రోటిలో రుబ్బుకోవడం మంచిది. రోటిలో ముందుగా పచ్చిమిర్చి మిశ్రమాన్ని దంచి, ఆ తర్వాత బీరకాయ, టమాటా మిశ్రమం, చింతపండు, కొత్తిమీర వేసి రుబ్బితే పచ్చడికి మంచి పాతకాలపు రుచి వస్తుంది. చివరగా పచ్చడికి తాలింపు పెట్టాలి. ఒక చిన్న పాన్‌లో కొద్దిగా నూనె వేడి చేసి శనగపప్పు, మినపప్పు, ఎండుమిర్చి, కరివేపాకు, కొద్దిగా ఇంగువ వేసి దోరగా వేయించాలి. ఈ తాలింపును సిద్ధంగా ఉన్న పచ్చడిలో వేసి బాగా కలపాలి. అంతే.. రుచికరమైన బీరకాయ టమాటా రోటి పచ్చడి సిద్ధం. తాజా పదార్థాలతో తయారు చేస్తే రుచి మరింత బాగుంటుంది. పచ్చడిని నిల్వ చేసేటప్పుడు పొడి, శుభ్రమైన గాజు సీసాలో పెట్టుకోవడం మంచిది.

## చక్కెరకు బైబై చెప్పాలనుకుంటున్నారా?.. ఈ 5 సహజ ప్రత్యామ్నాయాలు ట్రై చేయండి!



టీ రుచిని ఆస్వాదిస్తూనే చక్కెర తీసుకోవడం తగ్గించాలనుకుంటే, కొన్ని సహజమైన ప్రత్యామ్నాయాలను ఉపయోగించవచ్చు. ఇవి టీకి తీపిని అందించడంతో పాటు కొన్ని పోషక ప్రయోజనాలను కూడా కలిగి ఉండవచ్చు. అయితే ఏ ప్రత్యామ్నాయమైనా మితంగా తీసుకోవడం ముఖ్యం. చక్కెర ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు దాని వాడకాన్ని తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం మంచి నిర్ణయం కావచ్చు. అయితే టీకి చక్కెర తగ్గించగానే చాలామందికి దాని రుచి కొంత తగ్గినట్లు అనిపిస్తుంది. మీరు టీ రుచిని ఆస్వాదిస్తూనే చక్కెర తీసుకోవడం తగ్గించాలనుకుంటే, కొన్ని సహజమైన ప్రత్యామ్నాయాలను ఉపయోగించవచ్చు. న్యూస్18 బెంగాలీ కథనం ప్రకారం ఇవి టీకి తీపిని అందించడంతో పాటు కొన్ని పోషక ప్రయోజనాలను కూడా కలిగి ఉండవచ్చు. అయితే ఏ ప్రత్యామ్నాయమైనా మితంగా తీసుకోవడం ముఖ్యం. ని ఇష్టపడేవారు చక్కెరకు బదులుగా బెల్లాన్ని ఉపయోగించవచ్చు. బెల్లం టీకి ప్రత్యేకమైన రుచి, సహజమైన తీపిని అందిస్తుంది. అయితే బెల్లంలో కూడా కేలరీలు ఉంటాయి. కాబట్టి చక్కెరకు బదులుగా బెల్లం వాడుతున్నామని ఎక్కువ మొత్తంలో తీసుకోవడం మంచిది కాదు. తక్కువ పరిమాణంలో ఉపయోగిస్తే సరిపోతుంది. స్టీవియా: స్టీవియా మొక్క ఆకుల నుంచి తయారయ్యే సహజ స్వీటెనర్. సాధారణ చక్కెరతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ తీపిగా ఉంటుంది. అందుకే టీకి చాలా తక్కువ పరిమాణంలోనే సరిపోతుంది. కేలరీలు తక్కువగా ఉండే ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నవారు స్టీవియాను పరిశీలించవచ్చు. అయితే మార్కెట్లో లభించే ప్యాకెట్ ఉత్పత్తుల్లో ఇతర పదార్థాలు కలిపి ఉండవచ్చు కాబట్టి లేబుల్‌ను తప్పకుండా చదవాలి. మంక్ ఫ్రూట్ స్వీటెనర్: మంక్ ఫ్రూట్ కూడా చక్కెరకు ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం ఉపయోగిస్తున్నారు. ఇందులో ఉండే మొగ్రోసైడ్స్ అనే సహజ సమ్మేళనాల వల్ల తీపి రుచి వస్తుంది. ఇది కూడా చాలా తీపిగా ఉంటుంది కాబట్టి కొద్దిగా మాత్రమే ఉపయోగించడం మంచిది. ప్రస్తుతం కొన్ని దుకాణాలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో ఇది అందుబాటులో ఉంటుంది. తేనె: టీకి తీపి రుచి ఇవ్వడానికి తేనెను కూడా ఉపయోగించవచ్చు. ఇది టీకి ప్రత్యేకమైన రుచి, స్వల్ప సువాసనను అందిస్తుంది. అయితే తేనెలో కూడా చక్కెరలు, కేలరీలు ఉంటాయి కాబట్టి ఎక్కువగా కలపకూడదు. చక్కెరను పూర్తిగా తగ్గించాలనుకునేవారు తేనెను కూడా పరిమితంగానే ఉపయోగించాలి. ఖర్జూరం: ఖర్జూరం సహజమైన తీపి పదార్థం. ఇందులో ఫైబర్‌తో పాటు కొన్ని పోషకాలు కూడా ఉంటాయి. ఖర్జూరాన్ని పేస్ట్‌గా తయారు చేసి టీతో కలిపి ఉపయోగించవచ్చు. అయితే దీని వల్ల కూడా కేలరీలు పెరుగుతాయి కాబట్టి పరిమితంగా తీసుకోవడం మంచిది. చక్కెరను తగ్గించడమే మీ లక్ష్యమైతే, ఒక్కసారిగా తీపిని పూర్తిగా మానేయడం కంటే క్రమంగా టీకి వేసే చక్కెర పరిమాణాన్ని తగ్గించడం మంచి అలవాటు కావచ్చు. స్టీవియా, మంక్ ఫ్రూట్ వంటి పదార్థాలు ఎక్కువ తీపిగా ఉంటాయి కాబట్టి చాలా తక్కువగా ఉపయోగించాలి. బెల్లం, తేనె వంటి వాటిని కూడా ఎక్కువగా తీసుకోవద్దు. ప్యాకెట్‌లో లభించే ఏ స్వీటెనర్‌ను కొనుగోలు చేసే ముందు అందులోని పదార్థాలను పరిశీలించండి. ముఖ్యంగా మధుమేహం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఆహారంలో స్వీటెనర్లను మార్చే ముందు వైద్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. మంక్ ఫ్రూట్ వంటి పదార్థాలు ఎక్కువ తీపిగా ఉంటాయి కాబట్టి చాలా తక్కువగా ఉపయోగించాలి. బెల్లం, తేనె వంటి వాటిని కూడా ఎక్కువగా తీసుకోవద్దు. ప్యాకెట్‌లో లభించే ఏ స్వీటెనర్‌ను కొనుగోలు చేసే ముందు అందులోని పదార్థాలను పరిశీలించండి. ముఖ్యంగా మధుమేహం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఆహారంలో స్వీటెనర్లను మార్చే ముందు వైద్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.



# పైసా ఖర్చు లేకుండా బ్యూటీ కేర్! ఇంట్లోనే 100% ప్యూర్ రోజ్ వాటర్

తయారు చేయండి! ఇంట్లోనే తాజా గులాబీ రేకులతో రోజ్ వాటర్‌ను సులభంగా తయారు చేసుకోవచ్చు. కృత్రిమ సువాసనలు, ప్రిజర్వేటివ్స్ లేకుండా తయారు చేసుకునే ఈ రోజ్ వాటర్‌ను స్కిన్ కేర్‌లో ఉపయోగించవచ్చు. ముఖానికి తాజాదనాన్ని అందించడంతో పాటు స్కిన్ కేర్ రొటీన్‌లో భాగంగా రోజ్ వాటర్‌ను చాలాకాలంగా ఉపయోగిస్తున్నారు. మార్కెట్లో వివిధ రకాల రోజ్ వాటర్ అందుబాటులో ఉన్నప్పటికీ, అదనపు సువాసనలు లేదా ప్రిజర్వేటివ్స్ లేకుండా ఫ్రెష్ రోజ్ వాటర్‌ను ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. ఇందుకు తాజా గులాబీ రేకులు, శుభ్రమైన నీరు ఉంటే సరిపోతుంది. ఇప్పుడు శుభ్రమైన పాత్రలో గులాబీ రేకులను వేసి, అవి పూర్తిగా మునిగేంత నీటిని పోయాలి. పాత్రను తక్కువ లేదా మీడియం మంటపై ఉంచాలి. నీటిని ఎక్కువ మంటపై గట్టిగా మరిగించకూడదు. నెమ్మదిగా వేడెక్కుతున్న కొద్దీ గులాబీ రేకుల రంగు, సువాసన నీటిలోకి వస్తాయి. రేకులు తమ రంగును కోల్పోయిన తర్వాత గ్యాస్ ఆఫ్ చేయాలి. ఆ తర్వాత మిశ్రమాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి. అనంతరం శుభ్రమైన స్ట్రైనర్ లేదా పలుచటి వస్త్రంతో వడకట్టాలి. తయారైన రోజ్ వాటర్‌ను శుభ్రమైన గాజు బాటిల్ లేదా స్ప్రే బాటిల్‌లో పోసి ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవచ్చు. దీన్ని ఫేస్ మిస్ట్ లేదా టోనర్‌గా ఉపయోగించవచ్చు. ఆవిరి ద్వారా రోజ్ వాటర్ తయారు చేసుకోవాలనుకుంటే మరో పద్ధతిని కూడా ప్రయత్నించవచ్చు. ఒక పాత్రలో గులాబీ రేకులు, నీటిని వేసి వేడి చేయాలి. పాత్రపై మూతను తలకిందులుగా పెట్టి, దానిపై ఐస్ ముక్కలను ఉంచాలి. వేడి నీటి నుంచి వచ్చే ఆవిరి చల్లటి మూతను తాకినప్పుడు నీటి బిందువులుగా మారుతుంది. ఇలా సేకరించిన ద్రవాన్ని శుభ్రమైన బాటిల్‌లో నిల్వ చేసుకోవచ్చు.



# కింగ్ 100 టైటిల్ గ్లింప్స్ రిలీజ్

కింగ్ నాగార్జున మైల్‌స్టోన్ 100వ చిత్రం చకింగ్ 100, అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మాణంలో, రా కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమా పవర్‌ఫుల్ టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. నాగార్జున వాయిస్‌ఓవర్‌తో ప్రారంభమయ్యే గ్లింప్స్‌లో సమాజం మనుషులను వారి సంపద ఆధారంగా ఎలా విభజిస్తుందనే అంశాన్ని ఆసక్తికరంగా ప్రస్తావించారు. తన దగ్గర ఏమీ లేనప్పుడు తనను ‘లూజర్’ అని పిలిచారని, అదే సంపద సంపాదించిన తర్వాత ‘ది కింగ్’ అని పిలుస్తున్నారని నాగార్జున చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది. మరోవైపు నాగార్జున ఫొటోతో పాటు రూ.50,000 కోట్ల భారీ స్కామ్‌కు సంబంధించిన వార్తను చూపించడం సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. నాగార్జున మైల్‌స్టోన్ 100వ సినిమాకు ‘కింగ్ 100’ అనే టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంది. నాగార్జునను అత్యంత స్టైలిష్, డైనమిక్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, స్టైల్, యాటిట్యూడ్ ఆకట్టుకున్నాయి. నిజమైన సూపర్‌స్టార్‌కు ఉండే రాయల్ స్వాగ్‌తో నాగార్జున కనిపించారు. ఆయన పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తిని గ్లింప్స్ మరింత పెంచింది. ఈ చిత్రంలో టబు కీలక పాత్రలో నటిస్తున్నారు. ‘కింగ్ 100’ చిత్రం క్రిస్మస్ కానుకగా 2026 డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# ‘ది ప్యారడైజ్’ నుంచి ‘యెష నాగుల’ సాంగ్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని పాన్ ఇండియా యాక్షన్ ఎక్స్‌ట్రావ్యాగెంజా ‘ది ప్యారడైజ్’ ఇప్పటికే పోస్టర్స్, ఫస్ట్ సింగిల్ ‘ఆయా షేర్’, ఇటీవల విడుదలైన టీజర్‌తో భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ‘ఆయా షేర్’ కు వచ్చిన అద్భుతమైన స్పందన తర్వాత మేకర్స్ ‘యెష నాగుల’ తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. జానపద బాణీకి అనిరుధ్ తనదైన హై-ఎనర్జీ మ్యూజిక్‌ను జోడించిన ఈ పాటను డల్లాస్‌లో జరిగిన అనిరుధ్ కాన్సర్ట్‌లో లైవ్‌గా విడుదల చేశారు. వేలాది మంది అభిమానుల మధ్య పాటను లైవ్‌లో ప్రదర్శించగా, ప్రేక్షకులు డ్యాన్స్ చేస్తూ, కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకోవడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.ఈ పాటలో ప్రధానంగా ఆకట్టుకునేది తెలిసిన జానపద బాణీకి కొత్తదనాన్ని జోడించిన విధానం. ఇప్పటికే పాపులర్ అయిన ఫోక్ నంబర్‌కు అనిరుధ్ మరింత గ్రాండ్, సినిమాటిక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ఎనర్జిటిక్ పర్కషన్, వైబ్రెంట్ ఇన్‌స్ట్రుమెంటేషన్, రిథమిక్ లేయర్స్‌తో పాటకు పవర్‌ఫుల్ కాంటెంపరరీ ఫీల్ తీసుకొచ్చారు. కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ పాట మూడ్‌కు పర్ఫెక్ట్‌గా సరిపోయాయి. లైవ్లీగా, క్యాచీగా సాగుతూ పక్కా జానపద నేటివిటీని ప్రజెంట్ చేశాయి. జంగి రెడ్డి వోకల్స్ పాటకు అథెంటిక్ రస్టిక్ టచ్‌ను అందించగా, ప్రభా తన వోకల్స్ పాటలోని ఎనర్జీని మరింత పెంచారు. ఆట సందీప్ రిథమ్‌కు అనుగుణంగా ఫోక్ మూవ్‌మెంట్స్, మాస్ డ్యాన్స్ స్టెప్స్‌ను మేళవిస్తూ కొరియోగ్రఫీ అందించారు.



# ఫోక్ స్టార్ కిట్టు హీరోగా మూవీ ప్రారంభం




తెలంగాణా మట్టి వాసనలతో సంచలనమైన జానపద పాటలతో వందల మిలియన్ల వ్యూస్ సాధించి ప్రేక్షకులకు దగ్గరైన కిట్టు హీరోగా సినిమా ప్రారంభమైంది. యం.యస్ వారాహి క్రియేషన్స్ , శివమ్ మీడియా పతాకంపై ప్రొడక్షన్ నం 3గా ముని శివ, శివమల్లాలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు దిలీప్ సాయి నాయక్. శివమ్ మీడియా కార్యాలయంలో చిత్రం వైభవంగా ప్రారంభమైంది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ రచయిత ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్ , దర్శకుడు ఆర్.పి పట్నాయక్, నేషనల్ అవార్డు విన్నర్ సతీష్ వేగేశ్న, బిగ్ టీవి చైర్మెన్ విజయ్ రెడ్డి వెన్నం పాల్గొన్నారు. దర్శకుడు దిలీప్‌కి స్క్రిప్ట్‌ని సతీష్ వేగేశ్న, బుల్లెట్‌బండి లక్ష్మణ్ అందించగా హీరో కిట్టుపై చంద్రబోస్ క్లాప్ నిచ్చారు. ఆర్ పి పట్నాయక్ తొలిషాట్‌కి గౌరవ దర్శకత్వం వహించగా బిగ్ టీవి విజయ్ రెడ్డి కెమెరా స్విచాన్ చేసి టీమ్‌కి అభినందనలు తెలిపారు. చంద్రబోస్ మాట్లాడుతూ-- “ ఈ టీమంతా ఎంతో టాలెంట్ ఉన్నవారు. నిర్మాతలు ముని శివ, శివమల్లాలల, బుల్లెట్‌బండి లక్ష్మణ్, సంగీత దర్శకుడు మదిన్ నాకు ఎంతో ఆత్మీయులు. వారందరూ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా” అన్నారు. సతీష్ వేగేశ్న మాట్లాడుతూ-- మంచికథతో వచ్చిన దర్శకుడు దిలీప్‌కి మా శివలిద్దరూ ఎంతో సపోర్ట్ చేస్తున్నారు. వీరందరికి పెద్ద విజయం రావాలని కోరుకుంటున్నా” అన్నారు. ఆర్పి పట్నాయక్ మాట్లాడుతూ-- “ ఈ నిర్మాతలిద్దరూ మంచి సినిమాలు చేసి పెద్ద నిర్మాతలుగా మారి పదులకొద్ది సినిమాలు తీయాలని కోరుకుంటున్నా” అన్నారు. హీరో కిట్టు మాట్లాడుతూ--“ నేను చాలా చిన్న నటునిగా ఫోక్ సాంగ్స్ చేసేవాడిని. అలాంటిది నేను చేస్తున్న ఈ సినిమాకి ఇంత పెద్దవాళ్లు వచ్చి సపోర్టు చేయటం ఎంతో ఆనందంగా ఉంది” అన్నారు.



# ఒరిజినల్ మాన్‌స్టర్ ఫస్ట్‌లుక్ రిలీజ్

కన్నడ చిత్ర పరిశ్రమలో లెజెండ్ గా ప్రేక్షకాభిమానం పొందిన శాండల్ వుడ్ కింగ్ డా.శివరాజ్ కుమార్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా “ఒరిజినల్ మాన్ స్టర్”. ఈ క్రేజీ చిత్రాన్ని బ్లాక్ బస్టర్ డైరెక్టర్ ఆర్ చంద్రూ రూపొందిస్తున్నారు. ఆర్ సి స్టూడియోస్ ప్రొడక్షన్ బ్యానర్ పై ఆనంద్ పండిట్ సమర్పణలో యమున చంద్రూ నిర్మిస్తున్నారు. టాలీవుడ్ నటుడు సునీల్ ఈ సినిమాలో ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవెటెడ్ మూవీ ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సినిమాలో భారీ యాక్షన్ సీక్వెన్సులు ఉంటాయని తెలియజేస్తోంది. ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ ఈ భారీ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్ టైనర్ పై మరింతగా అంచనాలు పెంచుతోంది. పలు భారతీయ భాషల్లో “ఒరిజినల్ మాన్ స్టర్” సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889